ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 9, అక్టోబరు 2025

కబ్జా కాటు

దర్శిలో రూ.100 కోట్ల విలువైన భూములు స్వాహా

ఆక్రమణల చెరలో కాటేరు వాగు, జోమ్ కాలువ

దర్శి పట్టణంలోని కాటేరు వాగుతోపాటు జోమ్ కాలువ పరీవాహక ప్రాంతాలు కబ్జా కోరల్లో నలిగిపోతున్నాయి. అవి ఆక్రమణలతో కుంచించుకుపోవటంతో వర్షాలు పడినప్పుడు సమీప ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. అంతేగాక ఆ ప్రభావంతో కొన్ని ప్రధాన రహదారులపై సైతం నీరు పోటెత్తి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్నేళ్లుగా దశల వారీగా ఆక్రమణలు సాగుతూ చివరకు వాగులు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. సుమారు వంద కోట్ల రూపాయల విలువైన వాగు భూముల్లో అక్రమార్కులు పాగా వేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలుత హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత వదిలేయడం షరామామూలైంది.

- కొన్నేళ్లుగా చెలరేగిపోతున్న అక్రమార్కులు
- వైసీపీ హయాంలో విచ్చలవిడితనం
- జలదిగ్బంధం అవుతున్న లోతట్టు ప్రాంతాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఏ ప్రభుత్వం వచ్చినా తొలుత హడావుడి.. ఆ తర్వాత అధికారుల మౌనం


ఆక్రమణలతో కాలువలా మారిన దర్శిలోని కాటేరు వాగు

దర్శి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దర్శి-పొదిలి రోడ్డులోని కాటేరు వాగు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. వాగుకు ఇరువైపులా ఉన్న భూములు కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణదారులు గృహాలు, ఇతర నిర్మాణాలు చేశారు. ప్రస్తుతం వరద ప్రవాహం లేక ఆ వాగు మురుగు కాల్వగా మారింది. సుమారు 80 ఎకరాలకుపైగా వాగు భూమి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. అక్కడ ఎకరం సగటున కోటి రూపాయలకు పైన పలుకుతోంది. వాగు కుంచించుకుపోవడంతో వర్షాలు పడినప్పుడు కిందకు నీరు వెళ్లే అవకాశం లేక దర్శి-పొదిలి రోడ్డు బ్లాక్ అవుతోంది. అక్కడ నీరు పోటెత్తి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

జోమ్ కాలువ పరిధిలో సుమారు 20 ఎకరాలు మాయం

దర్శి పట్టణంలోని జోమ్ కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురవడంతో మురుగుకాల్వగా మారింది. వర్షాలు పడినప్పుడు ఈ కాలువకు వచ్చే నీరు కిందకు వెళ్లే వీలులేక వెలంవారివీధి, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లోని గృహాల్లోకి చేరుతోంది. రోడ్లు

మిగతా 6వ పేజీలో


కుంచించుకుపోయిన జోమ్ కాలువ


దర్శి వీధుల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు


అభివృద్ధి చేయనున్న మార్కాపురం చెరువుకట్ట రోడ్డు

రోడ్ల అభివృద్ధికి రూ. 61.48 కోట్లు

- వాటిలో రాష్ట్రీయ, ప్రధాన రహదారులు
- పలు నియోజకవర్గాలకు కేటాయింపు

ఒంగోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.61.48 కోట్లు మంజూరయ్యాయి. ఈమేరకు ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని రాష్ట్రీయ రహదారులు 56.77 కి.మీ అభివృద్ధికి రూ.31 కోట్లు, ప్రధాన రోడ్లు 63.78కి.మీ అభివృద్ధికి రూ.30.48 కోట్లు కేటాయించారు. రాష్ట్ర రహదారుల విభాగంలో ఒంగోలు డివిజన్ పరిధిలోని వావిలేటిపాడు-కామేపల్లి-కొండపి రోడ్డు 12కి.మీ అభివృద్ధికి రూ.3.50 కోట్లు, సంతనూతలపాడు మండలంలోని నాయుడుపాలెం రోడ్డు 8 కి.మీ అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. మార్కాపురం డివిజన్ పరిధిలోని గిద్దలూరు నియోజకవర్గంలో మూడు రోడ్ల అభివృద్ధికి రూ.3కోట్లు, మార్కాపురం-పొదిలి రోడ్డు 5.71 కి.మీ అభివృద్ధికి రూ.4కోట్లు ఇచ్చారు. ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం రోడ్డు 15.49 కి.మీ అభివృద్ధికి రూ.7కోట్లు, కనిగిరి డివిజన్ పరిధిలో కనిగిరి-డీజీపేట రోడ్డులో 4.70 కి.మీ అభివృద్ధికి రూ.5.50 కోట్లు, పొదిలి-వినుకొండ రోడ్డు దర్శి నియోజకవర్గ పరిధిలో 9.14 కి.మీ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరయ్యాయి. ఇక ఒంగోలు డివిజన్ పరిధిలోని ఒంగోలు నియోజకవర్గంలో రెండు ప్రధాన రోడ్లు 11.60 కి.మీ అభివృద్ధికి రూ.3.95 కోట్లు, కొండపి పరిధిలో రెండు పనులకు రూ.6.33కోట్లు, సంతనూతలపాడు పరిధిలో రెండు ప్రధాన రోడ్లకు రూ.6కోట్లు, కనిగిరి నియోజకవర్గానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. వీటిలో సింగరాయకొండ, పామూరు పట్టణాల్లోని ప్రధాన రోడ్లు కూడా ఉన్నాయి.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

వెలిగొండ జలాల తరలింపునకు డీపీఆర్

- మంత్రి డాక్టర్ స్వామి ఆదేశం
- జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష
- పాలేరు పరీవాహక చెరువులకు నీరు

7

అద్దెల వసూళ్లలో నిర్లక్ష్యం

- భారీగా బకాయిలు
- గడువు దాటిన దుకాణాలకు వేలం నిర్వహించని వైనం
- పాత యజమానుల నుంచి అనధికార వసూళ్లు
- మార్కాపురం మునిసిపల్ అధికారుల తీరుపై అనుమానాలు


మార్కాపురంలోని కూరగాయల మార్కెట్ వద్ద మునిసిపాలిటీ అద్దె దుకాణాలు

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మునిసిపాలిటీలు స్వయం సమృద్ధి సాధించాలి. ఎక్కడికక్కడ ఆదాయ వనరులను మెరుగుపర్చుకోవాలి. ఆయా మునిసిపాలిటీల అభివృద్ధికి నిధులు సమీకరించుకోవాలి.' ఇవీ పురపాలకశాఖ ఉన్నతాధికారులు పలు సమీక్షల్లో ఇస్తున్న ఆదేశాలు. కానీ మార్కాపురం మునిసిపాలిటీలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. బకాయిల వసూళ్ల విషయంలో మునిసిపల్ రెవెన్యూ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రూ.లక్షల్లో రావాల్సి ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు పనిచేస్తున్నారు. ఇప్పటికే గడువు తీరిపోయిన కొన్ని అద్దె దుకాణాల విషయంలో ఆ విభాగం అధికారులు, సిబ్బంది కొందరు చేతివాటం చూపుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని దుకాణాలకు వేలం నిర్వహించకుండా అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

పేరుకుపోయిన బకాయిలు

మార్కాపురం పురపాలక సంఘంలో మొత్తం 47 అద్దె దుకాణాలు ఉన్నాయి. వాటికి వేలం

మిగతా 6వ పేజీలో

నకిలీ మద్యంపై అప్రమత్తమైన ఎక్సైజ్

- విస్తృత తనిఖీలకు ఆదేశం
- పాత నేరస్థులపై నిఘా
- అధికారులకు దిశానిర్దేశం చేసిన డిప్యూటీ కమిషనర్



ఒంగోలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ యూనిట్ బయటపడటంతో ఆ శాఖ ఉలిక్కిపడింది. అదేవిధంగా ఆరు నెలల క్రితం కందుకూరులో నకిలీ మద్యం భారీగా దొరికింది. కందుకూరు మన జిల్లాకు సరిహద్దులో ఉంది. దీంతో అధికారులు అలర్ట్ అయ్యారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదేశించారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్థానిక డీసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నకిలీ మద్యం విషయాన్ని సీరియస్‌గా తీసుకుని పనిచేయాలన్నారు. మద్యం దుకాణాలు, బార్లలో సోదాలు చేయాలని

మిగతా 6వ పేజీలో

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు

ఎస్ఈ వెంకటేశ్వర్లు.. గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

32 కేసులు.. రూ.4.60లక్షల జరిమానా


పెద్దారవీడు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

7


ప్రదర్శనను ఆసక్తిగా చూస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్, క్విస్ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్‌పర్సన్ నిడమానూరి గాయత్రిదేవి

ముమ్ముందు మరిన్ని ప్రయోగాలు

- షార్ డైరెక్టర్ పద్మకుమార్
- అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం
- క్విస్ కళాశాలలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, ఇస్రో సంయుక్త నిర్వహణ
- ఆకట్టుకున్న అంతరిక్ష ప్రదర్శన

7

ఆరంభం అదుర్స్

- కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- కిలో రూ.320 పలికిన గరిష్ఠ ధర
- మన రాష్ట్రంలో తిరోగమనంలో మార్కెట్
- ధరలు పెంచాలని రైతుల డిమాండ్



ఒంగోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.320 పలికింది. పొగాకు బోర్డు చరిత్రలోనే వేలం ప్రారంభం రోజున ఈస్థాయి ధర లభించడం ఇదే ప్రథమం. అక్కడ పంట ఉత్పత్తి వరుసగా మూడో ఏడాది కూడా తగ్గడం అందుకు కారణమని తెలుస్తోంది. మన రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. ఇక్కడ మార్కెట్ తిరోగమనంలో ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటకలో గతంలో వలే ఈ సీజన్‌లో కూడా 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. సుమారు 85 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. ఈనేపథ్యంలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లను బుధవారం బోర్డు అధికారులు ప్రారంభించారు. తొలిరోజు ఒక్కో వేలం కేంద్రంలో 18 బేళ్ల వంతున అమ్మకానికి అనుమతించారు. మేలు రకం బేళ్లనే అక్కడి రైతులు తీసుకురాగా అన్నింటినీ వ్యాపారులు కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర కిలోకు రూ.320 ఇచ్చారు. గత ఏడాది కర్ణాటకలో కిలో రూ.290తో వేలం ప్రారంభించిన వ్యాపారులు ఈ సీజన్ ఆంధ్ర మార్కెట్‌లో కిలో రూ.280తో ప్రారంభించారు. అయితే ప్రస్తుత సీజన్ కర్ణాటకలో తొలిరోజు

మిగతా 6వ పేజీలో

చిరుత ఆచూకీ కోసం ట్రాప్ కెమెరాలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారి సూచన

వెలిగండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి గ్రామాల పరిధిలో చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలుసుకున్న అటవీశాఖ అధికారులు దాని ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిరుత సంచరిస్తూ.. రైతులకు కనిపించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అనుమానిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అది కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ పాల్గొన్నారు.


ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది



6

అట్టహాసంగా ఒంగోలు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావు ప్రమాణ స్వీకారం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ప్రదర్శన సభా ప్రాంగణమైన ఏ-1 కన్వెన్షన్ హాలు వరకూ సాగింది. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, డాక్టర్ ఉగ్ర, ఒడా చైర్మన్ రియాజ్, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- దీపావళి నాటికి 8,839 ఇళ్లను పూర్తిచేయాలి
- పురోగతి కన్పించకపోతే చర్యలు
- కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక

6వ పేజీలో



కబ్జా కాటు

(5వ పేజీ తరువాయి)

జలమయమవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షానికి శివాలయం వీధి, వెలంవారివీధి రోడ్లపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతోపాటు గృహల్లోకి నీరు చేరి సామాన్లు దెబ్బతిన్నాయి. రెండురోజుల తర్వాతగాని ఇళ్లలోకి చేరిన నీరు బయటకు పోలేదు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణం గల జోమ్ కాలువ ఇరువైపులా ఆక్రమణలు జోరుగా ఉండడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇక్కడ ఎకరా ధర రూ.2కోట్లకుపైగా పలుకుతోంది.

వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఆక్రమణలు

కొన్నేళ్లుగా అధికారులు ప్రభుత్వ భూముల రక్షణ గురించి పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ విచ్చలవిడిగా సాగిన విషయం విదితమే. అంతకుముందు భయంభయంగా కొంతమేర ఆక్రమించిన అక్రమార్కులు వైసీపీ ప్రభుత్వంలో అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోయారు. అవకాశం ఉన్న మేరకు ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారు. కాటేరు వాగు, జోమ్ కాలువ ఆక్రమణల చెరలో చిక్కుకోవడంతో వాటి సమీప ప్రాంత ప్రజలు వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బంది పడుతున్నారు.

200 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి కబ్జా

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్రమణలను తొలగిస్తారని ఆశించారు. కానీ ఇప్పటి వరకూ ఆ ఊసే లేకపోడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్శి-పొదిలి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డు, దర్శి-అద్దంకి రోడ్లల్లో మొత్తం 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఆ భూములకు విముక్తి కల్పిస్తే అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి, ఇతర అవసరాలకు వీలుకల్గుతుంది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనువైన స్థలాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇప్పుడైనా అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అద్దెల వసూళ్లలో నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

పాట నిర్వహించి అద్దెలు నిర్ణయించారు. వీటి ద్వారా మునిసిపాలిటీకి ప్రతి సంవత్సరం రూ.48.35 లక్షల మేర ఆదాయం రావాలి. కానీ ప్రతి సంవత్సరం బకాయిలు పేరుకుపోతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి రూ.13 లక్షల మేర బకాయిలు దుకాణదారుల నుంచి రావాల్సి ఉంది. సుమారు ఆరు నెలలు కావస్తున్నా వాటిలో 50శాతానికి మంచి వసూలు చేయలేదు. ప్రస్తుతానికి బకాయిలకు సంబంధించి రూ.6 లక్షలు ఇంకా వసూలు చేయాల్సి ఉంది. బకాయిలు, ప్రస్తుత డిమాండ్ మొత్తం కలిపి రూ.61.14 లక్షలు వసూలు చేయాల్సి ఉన్నా 40 శాతం మేర మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలిగారు. దుకాణాలకు సంబంధించి అద్దెలను ఎప్పటికప్పుడు ఏ నెలకు ఆనెల వసూలు చేయాలి. మొత్తం 47 దుకాణాల్లో మునిసిపాలిటీ కార్యాలయం చుట్టే 40 వరకు ఉన్నాయి. రెవెన్యూ విభాగంలో తగినంత మంది సిబ్బంది ఉన్నా నెలనెలా అద్దెలు వసూలు కావడం లేదు. ఆర్థిక సంవత్సరం చివర్లో హడావుడి చేసి మమ అన్పిస్తున్నారు.

గడువు దాటిన దుకాణాలకు వేలం ఎప్పుడు..?

మునిసిపాలిటీ పరిధిలోని 47 దుకాణాల్లో ఈ మధ్యనే తొమ్మిదింటికి గడువు దాటింది. వాటికి బహిరంగ వేలం నిర్వహించి కేటాయించాల్సి ఉంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కొందరు సిబ్బంది పాత యజమానుల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. వాటికి వేలం నిర్వహించకుంటే చేతివాటం చూపుకునేందుకు అవకాశం ఉంటుంది కాబట్టే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని నెలనెలా అద్దెలు చెల్లించే దుకాణ యజమానులు చర్చించుకుంటున్నారు. అంతేకాక కొందరు తాము అధికారపార్టీకి చెందిన వాళ్లము కాబట్టి మా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తామని అద్దెలు చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. మరికొందరు వేలంలో దుకాణాలు దక్కించుకుని సబ్ లీజుకు ఇచ్చుకుని నెలనెలా అద్దెలు తీసుకుంటున్నా మునిసిపాలిటీకి మాత్రం సక్రమంగా చెల్లించడం లేనట్లు సమాచారం. అద్దెల వసూళ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే బకాయిలు తగ్గే అవకాశం ఉంది.

ఆరంభం అదుర్స్!

(5వ పేజీ తరువాయి)

కిలోకు రూ.320 గరిష్ట ధర ఇచ్చారు. ఈ ఏడాది అక్కడ పొగాకు మార్కెట్ కాస్తంత ఆశాజనకంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇక్కడ ధరలు ఆశించిన స్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమకు కూడా ధరలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ మద్యంపై అప్రమత్తమైన ఎక్సైజ్

(5వ పేజీ తరువాయి)

సూచించారు. ముఖ్యంగా ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, క్లాసిక్ బ్లూ, కేరళ మాల్ట్, మంజీర బ్రాండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా స్పిరిట్ యూనిట్ల నిల్వలను కూడా పరిశీలించాలన్నారు. టంగుటూరు మండలం పసుముద్రలో నకిలీ మద్యం తయారీ కేంద్రం గతంలో నడిచిన విషయాన్ని ప్రస్తావించి దానికి సంబంధించిన నేరస్థులపై కూడా నిఘా ఉంచాలన్నారు. అన్ని మద్యం దుకాణాలతోపాటుగా, అనుమానిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, ఈఎస్ ఆయేషా బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం ● మంత్రి బాలవీరాంజనేయ స్వామి ● ఘనంగా ఒంగోలు ఏఎంసీ ప్రమాణ స్వీకార మహోత్సవం



ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, దానిని ఓర్వలేని వైసీపీ... ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలను తిప్పి కొట్టి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఒంగోలులో ఘనంగా జరిగింది. స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మంత్రి స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికై రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ స్పీడుతో దూసుకెళుతుందన్నారు. ఎన్నికలకు ముందుగా చెప్పిన ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. రూ.2వేలు ఉన్న పింఛన్‌లను వైసీపీ ప్రభుత్వం రూ.3వేలకు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజే రూ.4వేలకు పెంచిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్‌పై వైసీపీ అబద్ధపు ప్రచారం చేస్తోందని, దీనిని ప్రతి ఒక్కరు తిప్పికొటాలని అన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన చేపడుతుండగా, వైసీపీ అనవసరమైన నిరసనలతో అబద్ధపు మాటలతో ప్రజలను పక్కదారి పట్టిస్తోందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు తప్పకుండా వస్తాయన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, సమష్టిగా కృషితోనే కూటమి విజయం సాధ్యమైందని తెలిపారు. పదవులు రాలేదని అసంతృప్తి చెందవద్దని సమయం వచ్చిపుడు తప్పకుండా పదవులు వస్తాయని తెలిపారు. గత వైసీపీ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆ విషయం తాను మర్చిపోనని, అందరికీ న్యాయం చేస్తానని తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అభివృద్ధివైపు అడుగులు వేస్తుందని తెలిపారు. ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు ఏడు మునిసిపాలిటీలలో అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. దామచర్ల సత్య మాట్లాడుతూ రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం అన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కోసం, రూపు రేఖలు మార్చిన ఘనత సోదరుడు దామచర్ల జనార్ధన్‌కు దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు జిల్లా నుంచే మొదలుతాయని తెలిపారు. టీడీపీ సత్తా ఏమిటో గతంలో ఒంగోలులో జరిగిన మహానాడుతో నిరూపించడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. దామచర్ల నేతృత్వంలో ఒంగోలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. కనిగిరి శాసనసభ్యులు కనిగిరి ఉగ్ర నరసింహారెడ్డి, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, వై.పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, జనసేన నాయకులు కంది రవిశంకర్, పలువురు పార్టీ శ్రేణులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను మరింతగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అంతకముందు నగరంలోని మినీ స్టేడియం నుంచి ఏ1 ఫంక్షన్ హాలు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న కూమిటీ పార్టీల శ్రేణులు



మాట్లాడుతున్న మంత్రి స్వామి

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఒంగోలు వ్యసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా చిట్టెం వెంకట దుర్గా ప్రసాద్‌రావు, సభ్యులుగా ఉలిచి నందకుమార్‌రెడ్డి, సింగోతు కృష్ణ కుమారి, సూదనగుంట శ్రీనివాసరావు, గంగవరపు సందీప్, రేపూరి నాగమణి, యాదల కోటేశ్వరమ్మ, నుసుం ఆదిలక్ష్మి, నత్తల అనిత, బొద్దులూరి సోభ, ముత్యాల సుజాత, షేక్ అమురుల్లా, పప్పు శ్రీనివాసరావు, ఆకుతోట వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నూతన కమిటీని అభినందించారు.

వీఆర్వో కుమారుడిపై కేసు

● ఆర్మీ జవాన్ నుంచి నగదు వసూలు ● బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి ● పోలీసుల అదుపులో నిందితుడు

పీసీపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : తండ్రి ఉద్యోగాన్ని అడ్డపెట్టుకుని షాడో వీఆర్వోగా చెలామణి అవుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి అందిన మేర దండుకుంటున్న వీఆర్వో తనయుడిపై పీసీపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు... పెదయిర్లపాడు గ్రామానికి చెందిన అద్దంకి విజయ్(ఆర్మీ జవాన్) అతని కుటుంబ సభ్యులు రామయ్య, బాలయ్య, సుందరం, దావీదు, వినోద్‌బాబు, పేరయ్య, విశ్రాంతమ్మలకు సర్వేనెంబరు 1769/2, 255, 1619/2, 1430/2, 735/1లో భూములు ఉన్నాయి. ఆ భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాల కోసం ప్రస్తుతం పెదఅలవలపాడు వీఆర్వోగా పనిచేస్తున్న సుబ్బారావు 2023లో పెదయిర్లపాడు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనను సంప్రదించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వీఆర్వో తనయుడు సత్యనారాయణ అలియాస్ సత్యం తాను పాసుపుస్తకాలు చేయిస్తానని, అందుకు రూ.3.10లక్షలు ఖర్చు అవుతుందని విజయ్ అతని కుటుంబసభ్యుల నుంచి నగదు తీసుకున్నాడు. అందులో రూ.1.40లక్షలు ఆర్మీ జవాన్ విజయ్ నుంచి ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. నగదు తీసుకున్నప్పటికీ పాసుపుస్తకాలు ఇవ్వలేదు. ఆలస్యమయ్యేకొద్దీ బాధితుడు విజయ్ వీఆర్వో తనయుడిపై ఒత్తిడి చేయగా ఈ ఏడాది జూన్‌లో తానుతీసుకున్న నగదులో 80వేల రూపాయలను తిరిగి ఇచ్చేశాడు. అప్పటినుంచి మిగిలిన నగదు ఇవ్వాలని అడుగుతున్నా చెల్లించకపోగా ఆర్మీ జవాన్ విజయ్‌ను మీరు ఏం చేసుకుంటారో చేసుకోమని సత్యం బెదిరింపులకు దిగాడు. బాధితుడు విజయ్ ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీఆర్వో తనయుడు సత్యనారాయణ అలియాస్ సత్యంపై ఎస్సై కోటయ్య చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం రాత్రి అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

● దీపావళి నాటికి 8,839 గృహాలను పూర్తిచేయాలి ● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు.. అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా జిల్లాలో కేటాయించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం పీఎంఏవై, పీఎం జన్‌మన్ పథకాల పురోగతిపై గృహ నిర్మాణశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాటాడారు. ముందుగా ఆయా పథకాల ద్వారా జిల్లాలో గృహ నిర్మాణాల మంజూరు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలను ఆశాఖ పీడీ శ్రీనివాస ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ దీపావళి నాటికి 8,839 గృహాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినందున అందుకు అనుగుణంగా ఆయాగృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ స్కీంలో ఆప్షన్-3 కింద లబ్ధిదారులుగా ఉన్న వారికి కూడా కాంట్రాక్టర్లు త్వరగా ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతిలేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఇతర అధికారులు ఉన్నారు.

విద్యార్థుల వసతితో పాటు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి



సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు మంచివిద్యతో పాటుభోజనం, వసతితోపాటు ఆరోగ్యంపైనా ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం సంక్షేమశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెసిడెన్షియల్ విద్యాలయాలతోపాటు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, స్వంతభవనాలు, అద్దె భవనాలు, వాటి తనిఖీలు చేస్తున్న తీరు, ఆహార నాణ్యత తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని మండలంలో ప్రతి హాస్టల్‌ను ఒక మండల అధికారి దత్తత తీసుకొని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు లక్ష్మానాయక్, వరలక్ష్మీ, సువర్ణ, సువార్త, అర్జున్ నాయక,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

7 సబ్‌స్టేషన్‌ల వద్ద సోలార్ ప్లాంట్‌లు

● ఏర్పాటుకు స్థలాల పరిశీలన
● 17 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

అద్దంకి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సోలార్ విద్యుత్ అందించటమే ధ్యేయంగా పీఎం కుసుమ పథకం ద్వారా చేపట్టనున్న సోలార్ ప్లాంట్‌లకు అసవరమైన స్థలాలను ఎస్ఈ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. అద్దంకి నియోజకవర్గంలో 7 సబ్‌స్టేషన్‌లకు అనుబంధంగా 17 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు, వెలమవారిపాలెం, కొమ్మినేని వారిపాలెం, అద్దంకి మండలం సాధునగర్, శంకవరప్పాడు, కుంకుబాడు సబ్‌స్టేషన్‌ల సమీపంలో రైతుల వద్ద నుంచి భూములు లీజుకు తీసుకొని సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావులు ఎకోరన్ ఎనర్జీ ప్రతినిధులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. డీఈఈలు సురేంద్రబాబు, దామోదరం, డివిజన్ కార్యాలయం ఏఈ బాలకోటేశ్వరరావులు పాల్గొన్నారు.



వి.కొప్పెరపాడులో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

నాగులపాలెం హైవే రోడ్డు పరిశీలన

● ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన హైవే యంత్రాంగం

పర్చూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారి మార్గంలో పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు లేక పోవటం, డ్రైనేజ్ కాలువ తక్కువ వెడల్పుతో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. దీంతోపాటు వరద సమయాల్లో పంటలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. గ్రామస్థులు, రైతుల సమస్యపై స్పందించిన ఏలూరి హైవే అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో బుధవారం హైవే అధికారులు, రైతులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వీస్ రోడ్డుతోపాటు, డ్రెయిన్ 6 మీటర్లు పెంచే విధంగా చర్యలు చేపడతామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన సీడబ్ల్యూసీ చైర్మన్



కలెక్టర్ రాజాబాబుకు మొక్క ఇస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామాంజనేయులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబును జిల్లా బాలల సంక్షేమ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్మన్ వేమే రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం కలెక్టర్ రాజాబాబుకు మొక్కను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పిల్లలరక్షణ, సంరక్షణ, పునరావాసం, సంక్షేమం, దత్తత ప్రక్రియ, ఫోస్టర్ కేర్, అఫ్టర్‌కేర్, చిల్డ్రన్స్ కేర్ తదితర అంశాలను ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పొన్నలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపాడు గ్రామంలో విద్యుదాఘాతంతో మనకే తిరుపాలు (49) బుధవారం మృతి చెందారు. తిరుపాలు తన మిత్రులతో కలిసి గ్రామంలో ఉన్న పాలేరు వాగుకు వెళ్లి చేపలు పట్టుకుని తిరిగి వస్తుండగా కాలికి కరెంట్ తీగ తగిలింది. దాన్ని చేత్తో పట్టుకొనగా కరెంట్ షాక్ తగిలి తిరుపాలు పడిపోయాడు. స్థానికులు ఆటోలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించగా డాక్టర్ పరీక్షించి తిరుపాలు మరణించినట్లు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందిచడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనుక్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కేన్సర్ అనుమానిత కేసులను వైద్యాధికారికి బదలాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో అనుమానితులు ఉంటే వెంటనే సంబంధి వైద్యాధికారులకు రెఫర్ చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ సమావేశపుహాలులో బుధవారం ప్రోగ్రామ్ అధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో కేన్సర్ ఉన్నట్లు అనుమానాలు ఉంటే వెంటనే జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు సమాచారం అందించాలన్నారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు పోస్టర్లను జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వడ్డె బజార్‌లోని కోటపాటి ప్రశాంత్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను టౌన్ పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పట్టణ పోలీసులు వడ్డె బజారులో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రశాంత్ ఇంట్లో అక్రమంగా బాణసంచా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రశాంత్‌ను అరెస్టు చేసి, మతాబులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదుబాబు తెలిపారు. బాణసంచా విలువ రూ.లక్షపైనే ఉంటుందని తెలిపారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి హేయం

● పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయిపై దాడి అత్యంత హేయమైన చర్య అని, దుండగుడిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, సీఐటీయూ, ఎంఆర్‌పీఎస్ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యావత్ ప్రపంచం ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి చెందినట్లు వివరించారు. సనాతనం ముసుగులో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్ వ్యవస్థను నిషేధించాలని డిమాండ్ చేశారు. నాయకులు లింగంపల్లి జయరాజ్, ఎన్ బాబురావు, ఎం వసంతరావు, గోసాల ఆశీర్వాదం, బాబురావు, కాటి మార్క్, లక్ష్మీ నరసయ్య, శ్యామ్యేల్, భగవాన్‌దాస్, రవిశంకర్, అబ్రహం, సుబ్బారావు, జిలానీ, దీనరాజ్, ప్రసాద్, బీకే రెడ్డి, నాగిరెడ్డి, విమలాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.11.80 కోట్లు మంజూరు

అద్దంకి,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్లు అభివృద్ధికి 11,80 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పెదజాగర్లమూడి-పూరిమెట్ల రోడ్డులో నాగరాజుపల్లి - బల్లికురవ, కొమ్మాలపాడు-పరిటాలవారిపాలెంల మధ్య 13.5 కి.మీల రోడ్డు అభివృద్ధికి 8.80 కోట్ల రూపాయలు, శింగరకొండపాలెం-అంబడిపూడి,జె.పంగులూరు-బి.నిడమానూరు రోడ్డులలో 10 కి.మీ రోడ్డు అభివృద్ధికి 3 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ అధికారులు

వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

● నంద్యాల ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీశాఖ నంద్యాల ఫీల్డ్ డైరెక్టర్ బి.విజయకుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం 71వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థినులతో నినాదాలు చేసుకుంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బందికి, పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా నంద్యాల ఎఫ్‌డీ విజయకుమార్ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత కేవలం అటవీశాఖ అధికారులు, సిబ్బందిదే కాదన్నారు. ప్రతి ఒక్కరూ వాటి సంరక్షణలో భాగస్వాములు అయితేనే మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కాపురం, గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్లు మహ్మద్ అబ్దుల్ రవూఫ్, నిషాకుమారి, గిద్దలూరు, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వోలు కె.బాలరాజు, బబిత, మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, పాఠశాల హెడ్మాస్టర్ శ్రీదేవి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు



వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

గిద్దలూరు : మండలంలోని దిగువమెట్టలో వన విహారి ప్రాంతంలో వన్యప్రాణి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవులు-వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించి డ్రాయింగ్, ఇతర పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. అడవులను, వన్యప్రాణులను సంరక్షించుకోకపోతే మానవాళి మనుగడకే ముప్పు తప్పదని అటవీ శాఖ అధికారులు ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి నరసింహారావు, డిప్యూటీ రేంజ్ అధికారి వంశీకృష్ణకుమారి, బీట్ ఆఫీసర్లు రామకృష్ణ, చేజర్లయ్య, కోటేశ్వరరావు, నాగశేఖర్ పాల్గొన్నారు.

కళాశాల బస్సు డ్రైవర్‌పై దాడి

● వెంగముక్కపాలెం జంక్షన్ వద్ద కాపు కాసిన యువకులు
● ఇరువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కళాశాల బస్సు డ్రైవర్‌పై ఆరుగురు యువకులు దాడి చేసిన ఘటన స్థానిక వెంగముక్కపాలెం రోడ్డు జంక్షన్ బుధవారం సాయంత్రం జరిగింది. ఆరుగురు యువకులు ఒంగోలు నుంచి జరుగుమల్లి వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సును నిలిపివేసి డ్రైవర్‌పై దాడి చేశారు. వెంటనే సమాచారం అందుకున్న ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఒక విద్యార్థిని పట్ల బస్సు డ్రైవర్ అనుచితంగా ప్రవర్తించాడని పోలీసులకు పట్టుబడినవారు చెబుతున్నారు. దీనిపై విచారణ చేయల్సి ఉందని సీఐ చెప్పారు.

రామాలయ ధ్వజస్తంభంపై పిడుగుపాటు

ఒంగోలు(రూరల్) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో గల రామాలయం ధ్వజస్తంభంపై పిడుగు పడి దెబ్బతిన్న సంఘటన బుధవారం జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో పెద్ద శబ్దంతో ఉరుములు మెరుపులతో వర్షం పడింది. ఈ సమయంలో రామాలయ ధ్వజస్తంభంపై పిడుగుపడటంతో కింది భాగం దెబ్బతిన్నది. ఈ పిడుగుపడిన సమయంలో గ్రామస్థులు రామాలయం పక్కన గల షెడ్డులో ఉన్నారు.



సర్వేరెడ్డిపాలెంలో పిడుగుపడి దెబ్బతిన్న దేవాలయ ధ్వజస్తంభం

మార్కాపురంలో రాక్సీతో తనిఖీలు

● మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ పి.సుబ్బారావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు నుంచి వచ్చిన పోలీస్ డాగ్ రాక్సీతో బుధవారం పట్టణ, మండల పరిధిలోని పలుచోట్ల మాదకద్రవ్యాలను గుర్తించేందుకు మార్కాపురం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, చెన్నకేశవస్వామి దేవస్థానం, రాయవరం రైల్వేస్టేషన్‌లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా గంజాయి వినియోగిస్తున్నట్లు అనుమానాలు ఉన్న అన్ని ప్రాంతాల్లో రాక్సీతో తనిఖీలు చేయించారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, పి.అంకమ్మరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్ముందు మరిన్ని ప్రయోగాలు

● షార్ డైరెక్టర్ పద్మ కుమార్ ● క్విస్‌లో అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం ● సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, ఇస్రో సంయుక్త నిర్వహణ





విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో ఇస్రో మరిన్ని అంతరిక్ష ప్రయోగాలు చేస్తుందని శ్రీహరికోట హైఆల్టిట్యూడ్ రేంజ్ (షార్) డైరెక్టర్ పద్మ కుమార్ వెల్లడించారు. షార్, ఇస్రో, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ వారోత్సవాలు మొదలయ్యాయి. కార్యక్రమానికి పద్మకుమార్‌తోపాటు అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్, క్విస్‌విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ నిడమానూరి గాయత్రి దేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ పద్మకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు షార్, ఇస్రో పనితీరుపైనా, రాకెట్ లాంచింగ్‌పైనా వివరించారు. ఇస్రో ప్రయోగాలకు అంతర్జాతీయంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది లీవ్ ఇన్‌స్పేస్ కాన్సెప్ట్‌తో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, స్పేస్ ట్రావెల్ ఎలా ఉంటుంది? స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన విషయాలను సామాన్యులకు సైతం తెలిసే విధంగా కార్యక్రమాల ఏర్పాటు చేసినట్టు చెప్పారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రాజెక్టులపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారని, వారు చేసే ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అభినందించారు. అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్ మాట్లాడుతూ షార్, ఇస్రో ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ప్రయోగాలు చేశాయన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర అంశాల్లో తమ టెక్నాలజీ వాడుతున్నారని అన్నారు. ఓషన్ టెక్నాలజీలో సైతం ప్రయోగాలు చేస్తున్నట్టు చెప్పారు. నిడమానూరి గాయత్రి మాట్లాడుతూ రెండోసారి అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని అన్నారు.



అలరించిన ప్రదర్శనలు

వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్ష ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. క్విస్ విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ విద్యా సంస్థల నుంచి దాదాపు 2000 మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు. క్విస్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్డ్ స్పేస్ వీక్-025 ఒంగోలు సబ్ కమిటీ ఛైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

● విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు ● గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు ● 32 కేసులు, రూ.4,60,000 ఫైన్ విధింపు

పెద్దారవీడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. విద్యుత్ చౌర్యానికి నివారించేందుకు డివిజన్‌లో డీఈలు, ఏఈలు, పెద్దారవీడు, దోర్నాల సెక్టార్లలోని లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు, ఏఎల్‌ఎంలతో మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులను వసూలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలన్నారు. మార్కాపురం డివిజన్‌లో ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోయినప్పటికీ ఆ ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయకపోవడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతుందన్నారు. గిరిజన గూడేల్లో విద్యుత్ మీటర్లు లేకుండానే విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. గిరిజనులను చైతన్య పరిచి వారికి అందే సబ్సిడీ వివరాలను వివరించి మీటర్లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మార్కాపురం డివిజన్‌లో విద్యుత్ శాఖ అధికారులు, కింది స్థాయి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కిందిస్థాయి సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన సిమ్‌కార్డులు పనిచేసేలా చూడాలన్నారు. మండలంలో సచివాలయాల వద్ద అధికారులు, సిబ్బంది ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగం, ఒక మీటర్‌కు రెండు కనెక్షన్లు కలిగి ఉండడం, అదనపు లోడు వినియోగం తదితర అంశాలకు సంబంధించి 32 కేసులు నమోదు చేసి రూ.4,60,000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ(డీపీఈ) టి.హైమావతి, ఈఈ పి.నాగేశ్వరరావు, డీఈలు, జేఈలు, లైన్ మెన్లు, జేఎస్ ఎంలు, ఏఎల్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగొండ జలాల తరలింపునకు డీపీఆర్ తయారు చేయండి

● జలవనరులశాఖ అధికారులతో మంత్రి స్వామి సమీక్ష ● పాలేరు పరీవాహక చెరువులకు నీరిచ్చేందుకు చర్యలు

టంగుటూరు (కొండపి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ తూర్పు కాలువ నుంచి పునుగోడు రిజర్వాయర్ ద్వారా పాలేరు పరివాహక చెరువులకు నీరిచ్చేందుకు డీపీఆర్ తయారు చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జలవనరులశాఖ అధికారులతో ఆయన ఈవిషయంపై సమీక్ష నిర్వహించారు. పునుగోడు రిజర్వాయర్ నుంచి పాలేరులోకి నీరు తీసుకెళ్లేందుకు ఎటువైపు రూటు అనువుగా వుంటుంది అనే విషయంతోపాటు, కాలువల ద్వారానా, లేదా పైపులైన్ల ద్వారా నీటిని తరలింపు సాధ్యాసాధ్యాలను, ప్రత్యామ్నాయ మార్గాలను క్షుణ్ణంగా క్షేత్ర పరిశీలన చేసి త్వరగా పూర్తిస్థాయి వివరణాత్మక నివేదిక ఇవ్వాలని మంత్రి స్వామి అధికారులను ఆదేశించారు. మంత్రి స్వామి వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని ఇటీవల ప్రభుత్వాన్ని ఒప్పించి వెలుగొండ నుంచి 1.06 టీఎంసీల నీటిని పాలేరుకు ఇచ్చేందుకు అనుమతులు, జీవో తెప్పించారు. ఈ నేపథ్యంలో మర్రిపూడి మండల నాయకులతో కూడా బుధవారమే చర్చించారు. వారితోపాటు జలవనరులశాఖ అధికారులతో సమీక్షించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. జలవనరులశాఖ ఒంగోలు డివిజన్ ఈఈ ఎం.శివరామప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ అధికారులతో చర్చిస్తున్న మంత్రి స్వామి

రూ.1.30 కోట్ల పనులను పరిశీలించిన మంత్రి స్వామి

కొండపి, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.1.30 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రిసెప్షన్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. మరో రూ.80 లక్షలతో వైద్యశాలలోని లేబర్ గదులు, కంగారూ మదర్ కేర్ రూమ్, సెప్టిక్ థియేటర్, వార్డులు, గదులలో జరుగుతున్న నిర్మాణ పనులు, ఫ్లోరింగ్, టైల్స్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. నిర్మాణ పనులు కారణంగా ఓ గదిలో వేసిన సిమెంటు బస్తాలు పక్కన ఉన్న బెడ్లు పాడవకుండా మార్చుకోవాలని సిబ్బందికి మంత్రి ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో వైద్యులతోపాటు కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



గోతులమయంగా మారిన రోడ్డు

గతుకుల దారికి చెక్!

● వైపాలెం - త్రిపురాంతకం రోడ్డుకు రూ.7 కోట్లు మంజూరు

త్రిపురాంతకం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నరకం అనుభవిస్తున్న ప్రజల సమస్యకు ప్రజా ప్రభుత్వం పరిష్కారం చూపింది. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి బుధవారం నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం ఎర్రగొండపాలెం - త్రిపురాంతకం రోడ్డుకు రూ.7కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రోడ్డుపై గోతులు ఏర్పడి కేవలం 18 కిలోమీటర్ల దూరాన్ని గంటకుపైగా ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇక వర్షాల సమయంలో పరిస్థితి చెప్పడానికి వీలుకానిదిగా ఉండేది. గత వైసీపీ హయాంలో ఎన్నోమార్లు ప్రజలు ఈ రోడ్డు సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లగా ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తామని హామీ ఇచ్చారే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు విమర్శలు గుప్పించారు. కొన్ని సందర్భాల్లో వారివారి పరిధిలో రోడ్లపై గుంతలను పూడ్చేందుకు ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కూటమి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితిని పలువురు నాయకులు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పూర్తి చేసుకుని పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ఎరిక్షన్‌బాబు చెప్పారు. రోడ్ల సమస్యను పరిష్కరిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు చెప్తున్నారు.

రేపు,ఎల్లుండి 'ఎలక్ట్రానిక్' ప్రదర్శన



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ఒంగోలు కలెక్టరేట్,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్ర, శనివారాల్లో ఒంగోలులో ఎలక్ట్రానిక్ ప్రదర్శనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కాపు కళ్యాణమండపంలో బుధవారం ఎలక్ట్రానిక్ ప్రదర్శన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రదర్శనలో ఆటోమేటిక్ జింగిల్స్ ప్లే అయ్యే విధంగా సౌండ్ సిస్టం ఏర్పాటుతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో సోలార్ ప్యానల్స్, బొమ్మలు, మోటార్ వాహనాలు వంటి విభిన్న రంగాల ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, మేయర్ తదితరులందరినీ ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కళావతి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రచార కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

పొగాకు నాణ్యత మేరకు ధరలు ఇవ్వాలి

● వ్యాపారులకు ఆర్ఎం రామారావు


వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం రామారావు

కొండపి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నాణ్యతను బట్టి రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని వ్యాపారులకు బోర్డు ఇన్‌చార్జి ఆర్ఎం శీలం రామారావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం వ్యాపారులు, రైతులు, వేలం కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌కు అనుగుణంగా గ్రేడ్‌ల వారీ బేళ్లను వేలానికి తీసుకురావాలని ఆయన రైతులకు సూచించారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మాదక ద్రవ్యాలు వినియోగం, హెచ్ఐవీ నిర్మూలనలో వీఆర్వోలు భాగస్వాములు కావాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బాపట్ల జిల్లా ఎయిడ్స్ నిర్మూలన నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ అధ్యక్షతన నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోకలలు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అవగాహన, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా హెచ్ఐవీని అరికట్టవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 1097పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. హెచ్ఐవీ వివక్షత చూపకూడదన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఎయిడ్స్ రహిత గ్రామాలుగా రూపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలు నిర్మలనలోనూ కీలకపాత్ర వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, టీఐ ఎం.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ గవర్నర్‌గా వేణు


నియామకపత్రాన్ని అందుకుంటున్న వేణు

నాగులుప్పలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ వి205ఎ గవర్నర్‌గా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన అమరా వేణు ఎన్నికయ్యారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ 2026 ఏడాదికి గాను జిల్లా కమిటీ ఎన్నిక ఒంగోలులోని ఆర్యవైశ్య విద్యానిధి కార్యాలయంలో బుధవారం ఎన్నికల అధికారి ఉమాఅన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప్పుగుండూరు వాసవీ క్లబ్ నుంచి మాత్రమే నామినేషన్ దాఖలు కావడంతో గవర్నర్‌గా అమరా వేణు, కార్యదర్శిగా చలువాది సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా గుర్రం రంగనాథ్, సెక్రటరీ సర్వీసెస్‌గా పులకణం రాజేష్, వైస్ గవర్నర్‌గా చందా వెంకటస్వామిలను ఏకగ్రీవంగా ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐఈసీ కొంజేటి సురేష్‌బాబు, కనమర్లపూడి హరిప్రసాద్, సత్యనారాయణ, చుండూరి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజేపై దాడి చేయడం భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి చేసినట్లుగానే భావించాలన్నారు. న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేణుమాల మాధవ్, రావినూతల వెంకటేష్, మహేష్, మోజేష్, బి.మనోహర్, సంతోష్, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

● సీజే గవాయ్‌పై బూటు విసిరిన నిందితుడిని అరెస్టు చేయాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. స్థానిక మంగమూరు రోడ్డులోని మూడుబొమ్మల సెంటర్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కట్టా వరప్రసాద్, కటికాల కార్తీక్, జాలరామయ్య, జి.వెంకటేశ్వర్లు, దాసరి బాబురావు, జె.సుబ్బారావు, ఎస్‌కే.ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అనకర్లపూడి రోడ్డుకు మరమ్మతులు



క్వారీడస్ట్‌తో రోడ్డును చదును చేయిస్తున్న అధికారులు

కొండపి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండపి నుంచి అనకర్లపూడి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును తాత్కాలికంగా బాగు చేసే కార్యక్రమాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆదేశాలతో అధికారులు మెయింటెన్స్ పనుల కింద రోడ్డు మార్జిన్‌లలో మట్టిని తొలగించి, క్వారీ డస్ట్‌ను తోలి చదును చేయించారు. రోడ్డులోని గోతులను కూడా క్వారీడస్ట్‌తో పూడ్పించారు. ఈరోడ్డుకు నిధులు మంజూరై శాశ్వతంగా తారు రోడ్డు నిర్మాణం జరిగే వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందుల లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

భూమికి నష్టపరిహారం ఇచ్చారు..
చెట్లకు, బోర్లకు మరిచారు..!

● నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంతో భూ బాధితుల ఆవేదన

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారని, భూమిలో ఉన్న చెట్లకు, బోరుకు, పైప్‌లైన్లకు నష్టపరిహారం చెల్లించకుండానే రైల్వేట్రాక్ నిర్మాణ పనులు చేపడుతున్నారని వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మరో రైతుతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నర్రమారెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల వైస్ ఎంపీపీకి చెందిన పోకా వెంకట్రావు భూమిలో రైల్వేలైన్ భూసేకరణలో 1.47 ఎకరాల భూమి, డేగా మాల్యాద్రికి చెందిన 80 సెంట్ల భూమిని భూసేకరణ చేశారని అందుకుగాను నష్టపరిహారం అందజేసి ఉన్నారని తెలిపారు. ఆ భూమిలో ఉండే టేకు, మామిడి, నిమ్మ, ఉసిరి, వేప, నేరుడు చెట్లతోపాటు మూడుబోర్లకు పైపులైన్‌కు అవార్డు ప్రకటించకుండానే పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత వీఆర్వోలను అడిగితే అవార్డు రాలేదని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అప్పీల్ చేసుకోవాలంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగిన నష్టపరిహారం సొమ్ములు మంజూరు చేసేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


పెదగచ్చుల కల్వర్టుపై ఏర్పడ్డ గొయ్యి


ఎండ్లూరు డొంకవద్ద రక్షణ గోడలు లేని కల్వర్టు



ఆదమరిస్తే అంతే..!

● ప్రమాదకరంగా కల్వర్టర్లు
● గోతులమయంగా మారిన వైనం
● వాహనదారుల భయాందోళన
● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

సంతనూతలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నుంచి ఒంగోలు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. సంతనూతలపాడు సమీపంలోని పెదగచ్చుల కల్వర్టుపై రెండు వారాల క్రితం చిన్నపాటి గుంత ఏర్పడి ప్రస్తు


ఎండ్లూరు డొంకవద్ద కుంగిపోయిన చప్టా

తం పెద్ద గొయ్యిగా మారింది. కల్వర్టు కింద కొన్నేళ్ల క్రితం తూతూమంత్రంగా ఇనుపకమ్మీలు ఏర్పాటు చేసి పైన తారురోడ్డు నిర్మాణం చేపట్టి పైపైమెరుగులతో కొత్తరోడ్డుగా తయారు చేశారు. అయితే కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు కింద ఉన్న ఇనుపకమ్మీలు దెబ్బతిని ప్రస్తుతం మరింత ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు చిన్నపాటి హెచ్చరిక బోర్డును గొయ్యి చుట్టు ఎర్రటి కవర్లలో బండలను ఏర్పాటుచేసి మమ అనిపించారు. అదేవిధంగా ఎండ్లూరు డొంకవద్ద కల్వర్టు కూడా రోడ్డుకు ఉండే సైడువాల్స్ పూర్తిగా పడిపోయి, రోడ్డుసైతం కిందకు కుంగిపోయింది. రహదారికి రెండువైపుల చెరువులను తలపించే మురుగునీరు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి ఏర్పడింది. నిత్యం చీమకుర్తి-ఒంగోలు మార్గంలో గ్రానైట్‌లారీలు, ఇతర వాహనాలు వందల సంఖ్యల్లో రాకపోకలు సాగిస్తుంటాయి. చీమకుర్తి గ్రానైట్ ఏరియా నుంచి కొన్ని అధికబరువు కలిగిన లారీలు వెళ్తున్న సమయంలో రోడ్డు మరింతగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఒంగోలు నుంచి చీమకుర్తి పొదిలి మీదుగా కర్నూల్, నంద్యాల, మార్కాపురం, శ్రీశైలం, బెంగుళూరు, కడప తదితర ప్రాంతాలకు వెళ్లే వారు దాదాపు ఈ రహదారి గుండానే వెళ్తుంటారు. పైరెండు కల్వర్టర్లు పూర్తిగా దెబ్బతింటే మాత్రం వాహనాల రాకపోకలు స్తంభించే ప్రమాదం నెలకొంది, దెబ్బతిన్న కల్వర్టుల వద్ద పక్కనే ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటుచేసి శాశ్వతస్థాయిలో కల్వర్లలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్ఐ


గొయ్యిని పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు సమీపంలోని పెదగచ్చుల బ్రిడ్జిపై ఏర్పడ్డ గొయ్యిని ఎస్ఐ వి.అజయ్‌బాబు బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా ఎరుపు రంగు రేడియం స్టిక్కర్‌ను బోర్డు వేసి గొయ్యి వద్ద ఏర్పాటు చేయించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులతో సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడారు. రోడ్డుపై ఏర్పడ్డ గొయ్యికి త్వరగా మరమ్మతులు చేపట్టాలంటూ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఉప్పుగుండూరు పంచాయతీ పాలకవర్గాన్ని రద్దు చేయాలి

● గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదు..
● ప్రత్యేకాధికారిని నియమించాలి
● గ్రామస్థుల నిరసన


పంచాయతీ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్థులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు గ్రామంలోని సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, కనీసం పాలకవర్గ సమావేశాలు సైతం నిర్వహించకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. బుధవారం వారు గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులతో కలిసి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును సమస్యలపై నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరి 19న జరిగిన పాలకవర్గ సమావేశం తర్వాత జరగాల్సిన సమావేశాలకు సర్పంచ్, ఇతర వార్డు సభ్యులు ఎవరూ హాజరుకాలేదని, తద్వారా గ్రామాభివృద్ధి కుంటుబడిందన్నారు. గ్రామంలో పారిశుధ్య అధ్వానంగా ఉందని, సైడుకాలువల్లో మురుగు పేరకుపోయిందని, రోడ్లపై చెత్తచెదారం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు, విషపురుగులు విజృంభిస్తున్నా పంచాయతీ పాలకులు కానీ, అధికారులు గాని పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. తాగునీటి చెరువులోని నీరు కలుషితంగా మారి దుర్వాసన వస్తోందని, ఫిల్టర్‌బెడ్‌లు అపరిశుభ్రంగా మారాయని, ఆ నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీలోని నిధులు సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. ఉత్తమ పంచాయతీగా అవార్డులు అందుకొన్న ఉప్పుగుండూరులో గ్రామ పాలన మితిమీరిన రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తంగా మారిందని ధ్వజమెత్తారు. పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా గ్రామస్థుల నిరసన విషయం తెలుసుకున్న ఎంపీడీవో రవికుమార్ ఉప్పుగుండూరు పంచాయతీ వద్దకు వచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, పంచాయతీ పాలకవర్గం తీరుపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పాలకవర్గాన్ని తక్షణమే ఉన్నతాధికారులు రద్దు చేయాలని, ప్రత్యేకాధికారిని నియమించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు తెలగతోటి జాన్సన్, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కనగాల కృష్ణ, సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్, నలతోటి రామారావు, గుమ్మడి చిన్నా, బెల్లం శేషారావు, బీమవరపు శివ, గోగినేని శేషగిరి, కాకాని సుబ్బారావు, ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు, కొలకలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేయాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన విధానమన్నారు. అందుకు అనుగుణంగా యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి మార్గం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సెర్ప్, మెప్మా, నైపుణ్యాభివృద్ధి విభాగాలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. వృత్తి విద్యకాలేజీల్లో ప్రముఖ పారిశ్రామిక కంపెనీలకు చెందిన యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆయా పనుల్లో ప్రత్యక్ష అనుభవం వస్తుందని చెప్పారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు సమావేశంలో అధికారులు నారాయణ, శ్రీహరి, రమాదేవి, శ్రీనివాసరెడ్డి, శ్రీమన్నారాయణ, చిరంజీవి, ఎం.వెంకటేశ్వరరావు, రజనీకుమారి, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీడబ్ల్యూసీ చైర్మన్


కలెక్టర్ రాజాబాబుకు మొక్కను అందజేస్తున్న చైర్మన్ రామాంజనేయులు

ఒంగోలు నగరం: స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును బుధవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో బాలల సంరక్షణ, పునరావాసం, సంక్షేమం, దత్తత ప్రక్రియ, చిల్డ్రన్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌ల గురించి కలెక్టర్‌కు వివరించారు. బాలల సంరక్షణ కోసం జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించారు. నూతనంగా కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

● జేసీ గోపాలకృష్ణ


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, అతిథులు

కొత్తపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ విద్యను అందించే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. తాను కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్ష రాసి ఆల్ ఇండియా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటి సాకారం చేసుకునే దిశగా పట్టుదలతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తపట్నం మండలంలో విద్యారంగంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ అందరూ చదవాలి-అందరూ ఎదగాలి అనే ఉద్దేశ్యంతో 2015 సంవత్సరం నుంచి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న కె.హరిబాబు(కొత్తపట్నం జడ్పీ హైస్కూలు), అరుణ(కేజీబీవీ, మోటుమాల), బీవీ.ప్రభాకరరెడ్డి(గమల్లపాలెం), ఎ.మాలతి ఇందిర(పట్టపుపాలెం), జి.కోటమ్మ(ఆలూరు), సీహెచ్.ఉమామహేశ్వరి(అల్లూరు), శ్రీవాణి విద్యానికేతన్ నుంచి నిరీక్షణ, పోలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు, డాక్టర్ చాపల శాంతకుమారి, తహసీల్దార్ కె.శాంతి, ఎంఈవోలు తులసికుమారి, పద్మావతి పాల్గొన్నారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న విక్టోరియారాణి

కొండపి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ కొండపి సెక్టార్ సూపర్ వైజర్ విక్టోరియారాణి సూచించారు. బుధవారం మండలంలోని చినవెంకన్నపాలెం, పెట్లూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం అందించే ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాల ప్రాముఖ్యాన్ని ఆమె వివరించారు.

పనిగంటల పెంపును నిలుపుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన పనిగంటల బిల్లును ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏపీ వ్యవసాయకార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సాగర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కాలం సుబ్బారావు, కంకణాల ఆంజనేయులు, బాలకోటయ్య, కేఎఫ్.బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. కార్మికుల శ్రమను దోచుకోనేలా పనిగంటలను కూటమి ప్రభుత్వం పెంచడం దుర్మార్గంగా ఉందని, ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులతో కలిసి ఆందోళనలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కనపర్తి సుబ్బారావు, రమేష్, జి.శ్రీనివాసులు, కల్పన, చీకటి శ్రీనివాసరావు, చిరంజీవి, మహేష్, బీవీ.రావు, రమేష్, తంబి శ్రీనివాసులు, సీహెచ్.రాంబాబు, కె.శ్రీనివాసరావు, కుమారి, రవి, జి.శేషయ్య, టీవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మారిటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య బుధవారం ఎస్పీ వి.హర్షవర్ధనరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన ఎస్పీని కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

వైద్యశాఖ మాస్‌మీడియా అధికారి బాధ్యతల స్వీకరణ


డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు బొకే అందజేస్తున్న నరసింహారావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారిగా బెల్లం నరసింహారావు బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడకు వైద్యశాఖ మీడియా అధికారిగా బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావును వైద్యశాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పెట్రోలు బంకుల తనిఖీ


తనిఖీలు చేస్తున్న తహసీల్దార్, విజిలెన్స్ అధికారులు

టంగుటూరు (కొండపి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న పెట్రోలు బంకులను బుధవారం తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వాటి వద్ద ఉన్న తాగునీరు, వాహనాలకు గాలి నింపే పంపులు, టాయిలెట్లు, డీజిల్, పెట్రోల్ కచ్చితత్వాన్ని, రేట్ల పట్టికలను పరిశీలించారు. అన్ని వసతులు బాగున్నాయని తనిఖీ అనంతరం తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కోడిపందెం వేస్తున్న ఐదుగురు అరెస్టు

టంగుటూరు (కొండపి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు గ్రామ పరిధిలో ఉన్న కుంట సమీపంలో నడుస్తున్న కోడిపందెం స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.5,601 నగదుతోపాటు ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

క్రీడా దుస్తుల అందజేత


క్రీడాదుస్తులను అందజేసిన పీడీ సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు మున్నంగి సురేష్‌బాబు 9మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. బుధవారం స్థానిక స్కూలులో చదువుతున్న విద్యార్థులకు తన సొంత నిధులతో క్రీడాదుస్తులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ముస్లింలకు శ్మశాన స్థలాన్ని కేటాయించేందుకు బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్థానిక కేశవరాజుకుంటలో ప్రభుత్వ భూమి ఉండటంతో ఆర్డీవో కళావతి, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లుతో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు సందర్శించారు. ఆ భూమికి సంబంధించిన పలు అంశాలను సర్వేయర్‌ను అడిగి జేసీ తెలుసుకున్నారు. శ్మశానికి స్థలం కేటాయించేందుకు నగర పాలక సంస్థల తీర్మానం చేసినందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాలగోపాల్, శంకరన్‌లకు నివాళి


ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాహక్కుల నేత బాలగోపాల్, పీడితప్రజల అధికారి శంకరన్‌ల వర్ధంతి కార్యక్రమాలను బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న మంచి పుస్తకం కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ ఆధ్వర్యంలో బాలగోపాల్, శంకరన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కత్తి కళ్యాణ్, టి.వెంకటస్వామి, బి.సుబ్బారావు, పేరయ్య, పేరం సత్యం, ధరణికోట లక్ష్మీనారాయణ, రవికుమార్, కరవది సుబ్బారావు, ఎం.జార్జి, ఆవుల సుబ్రహ్మణ్యం, గుంటూరు మస్తాన్‌రావు, ఎల్.ప్రసాద్, పిన్నిక శ్రీనివాస్, మురహరిరావు, ఆంజనేయులు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్ఐ వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించి ధృవీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐ పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

డాక్టరేట్ ప్రదానం


ఆళ్ల హరిబాబు

ఒంగోలు(రూరల్), అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన సీనియర్ న్యాయవాది ఆళ్ల హరిబాబుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈమేరకు యూనివర్సిటీ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్‌ను హరిబాబుకు బుధవారం అందజేశారు. ఒంగోలు కోర్టులో న్యాయవాదిగా పని చేస్తూ స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. హరిబాబు న్యాయశాస్త్రంలో రీసెర్చ్ గైడ్‌గా ఆ కళాశాల ప్రిన్సిపాల్ నటరాజ్‌కుమార్ వ్యవహరించారు. హరిబాబును పలువురు ప్రముఖులు అభినందించారు.



ఆగిన ఆటోను ఢీకొట్టిన కారు

ముగ్గురికి గాయాలు

పెద్దదోర్నాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై తిరుమలనాథ దేవాలయం వద్ద బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఐనముక్కల గ్రామానికి చెందిన ఒడిచెర్ల కృష్ణారెడ్డి, చిట్యాల సరస్వతి, అల్లు నారాయణమ్మకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని యడవల్లి పొలాల్లో వ్యవసాయ పనులు ముగించుకుని కూలీలను స్వగ్రామం ఐనముక్కల తీసుకెళ్లేందుకు రోడ్డుపై ఆటోను నిలిపి డ్రైవర్ కృష్ణారెడ్డి ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో ముందుగా వచ్చిన ఇద్దరు మహిళలు ఆటోలో ఎక్కారు. మిగిలిన వారి కోసం ఎదురు చూస్తుండగా కర్నూలు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికీ గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన కొందరు 108కి సమాచారమివ్వగా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

బైపాస్ కూడలిలో లారీ బోల్తా

బైపాస్ కూడలిలో క్యాబేజీ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన బుధవారం జరిగింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నూతనంగా నిర్మాణం జరుపుకున్న ఈ హైవే కూడలి మూలమలుపు వద్ద ఎక్కువగా పల్లంగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.























ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

కొమరోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని గిద్దలూరు టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పబ్లిక్ గ్రీవెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కృష్ణకిషోర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో దేవరశెట్టి భాగ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జం రవీంద్రారెడ్డి, ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పీ4 టీం ఎంపీ షాజాన్ పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటున్న కృష్ణకిషోర్‌రెడ్డి

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

పొదిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం పారిశుధ్య పనులను శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోర్స్ లెవల్లో సెగ్రిగేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని క్లాప్‌మిత్రలకు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరాన్ని బట్టి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వర్ణ పంచాయతీ హౌస్‌టాక్స్, నాన్‌టాక్స్ సంబంధించిన అరియర్స్‌ను నెలాఖరులోపు వసూలు చేయాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, సర్పంచ్ యాకోబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


ఉప్పలపాడులో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

అక్రమంగా మట్టి తోలితే చర్యలు

రాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో ట్టిని అక్రమంగా తవ్వి తోలితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. ఎడవల్లి పంచాయతీ పరిధి 913సర్వే నెంబర్‌లో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తోలకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఆయన సిబ్బందితో వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో వీఆర్వో ఎస్.రంగయ్య, వీఆర్‌ఏలు సురేష్, రమణ పాల్గొన్నారు.

త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులను త్వరలో అందజేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో దాదాపు 10,053 మంది కార్డుదారులు ఉన్నారని వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు కార్యాలయానికి వచ్చాయని ఆయన తెలిపారు.



రైలు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన షేక్ సలీం రైలులో నుంచి జారిపడి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. సలీం తన కుటుంబ సభ్యులతో కాచిగూడ వెళ్లేందుకు మంగళవారం రాత్రి సోమిదేవిపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడగా నడుముకు గాయమైంది. 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు.

డీజే బాక్స్‌లు వాడితే చర్యలు తప్పవు

సీఐ సుబ్బారావు

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇష్టారీతిన డీజే సౌండ్ బాక్స్‌లు వాడితే చర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు డీజే బాక్స్‌ల ద్వారా ఇష్టారీతిన సౌండ్ పెట్టేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వడంలేదన్నారు. ఈ శబ్దాల వలన చిన్నపిల్లలు, వృద్ధులు, హృద్రోగ సమస్యలు ఉన్న వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసుశాఖ అనుమతితో పరిమితి కలిగిన సౌండ్ మాత్రమే పెట్టుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

































భూమికి నష్టపరిహారం ఇచ్చారు.. చెట్లకు, బోర్లకు మరిచారు..!

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంతో భూ బాధితుల ఆవేదన

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారని, భూమిలో ఉన్న చెట్లకు, బోరుకు, పైప్‌లైన్లకు నష్టపరిహారం చెల్లించకుండానే రైల్వేట్రాక్ నిర్మాణ పనులు చేపడుతున్నారని వైసీపీ గంధం ఏసురత్నం ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మరో రైతుతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నర్రమారెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల వైస్ ఎంపీపీకి చెందిన పోకా వెంకట్రావు భూమిలో రైల్వేలైన్ భూసేకరణలో 1.47 ఎకరాల భూమి, డేగా మాల్యాద్రికి చెందిన 80 సెంట్ల భూమిని భూసేకరణ చేశారని అందుకుగాను నష్టపరిహారం అందజేసి ఉన్నారని తెలిపారు. ఆ భూమిలో ఉండే టేకు, మామిడి, నిమ్మ, ఉసిరి, వేప, నేరుడు చెట్లతోపాటు మూడుబోర్లకు పైప్‌లైన్‌కు అవార్డు ప్రకటించకుండానే పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత వీఆర్వోలను అడిగితే అవార్డు రాలేదని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అప్పీల్ చేసుకోవాలంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగిన నష్టపరిహారం సొమ్ములు మంజూరు చేసేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైస్ ఎంపీపీ

'వెలుగు' నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ


వెలుగు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అపర్ణ

దొనకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : దొనకొండ వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు చెందిన నిధులు భారీగా స్వాహా జరిగిన ఆరోపణలపై జిల్లా విజిలెన్స్ ఏఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్ఎస్ఎస్ అపర్ణ బుధవారం విచారణ చేపట్టారు. 2016నుంచి 2019 సంవత్సరాల్లో దొనకొండ వెలుగు కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహించిన సుచేంద్రరావు గంగదేవిపల్లి, గుడిపాడు, ఎర్రబాలెం, బేతేల్‌పురం, రాగమక్కపల్లి, బాదాపురం గ్రామ సంఘాలలో పొదుపు మహిళలకు చెందిన వివిధ రకాల నిధులు దాదాపు రూ.13 లక్షల వరకు స్వాహా చేసి అతని భార్య, అమ్మ బ్యాంక్ అకౌంట్లకు జమచేసుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు సీసీ సుచేంద్రను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఇటీవల డీఆర్‌డీఏ సెర్ప్ అధికారులు విచారణ నిమిత్తం విజిలెన్స్‌కు అప్పగించారు.

విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అపర్ణ రంగంలోకి దిగి పొదుపు గ్రూపులకు చెందిన బ్యాంక్ చెక్కులు, అందుకు సంబంధించిన పూర్తి రికార్డులు తనిఖీ చేసి అప్పటి సీసీలు, వీవోఏలు, గ్రామ సంఘం లీడర్లను విచారించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు అనిత, ఏపీఎం వెంకటేశ్వరరావు, వెలుగు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీఇవీ

బ్యాంక్ లింకేజీ రుణ బకాయిలు సకాలంలో చెల్లించాలి

యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజ్

తాళ్లూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళల అభ్యున్నతి కోసం బ్యాంక్‌లు అందిస్తున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తూర్పుగంగవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్.వెంకటరెడ్డి చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలు, వీఓఏలతో బ్యాంక్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు రుణాల చెల్లింపుల గురించి బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రూపుల్లో ఉన్న వారిలో సగంమంది మాత్రమే బకాయిలు చెల్లిస్తున్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం నుంచి అందే వడ్డీ రాయితీ పొందే అవకాశం కోల్పోతున్నారని చెప్పారు. వీవోఏలు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ బకాయిలు చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరాబ్యాంక్ మేనేజర్ఏ.పృథ్వీ, వెలుగు ఏపీఎం పి.దేవరాజ్, మండల సమాఖ్యఅధ్యక్షురాలు ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి ఘన నివాళి


రాజ్యలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణ బూత్ కమిటీ ఇన్‌చార్జ్ బండ్ల వెంకట నారాయణ మాతృమూర్తి రాజ్యలక్ష్మి దశదిన కార్యక్రమం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలోబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, యారవ శ్రీనువాసులు, వైస్ ఏఎంసీ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, నేతలు సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, ఎన్ సాంబయ్య, పందిటి హరీష్, ఎండోమెంట్ ఈవో నరసింహబాబు పాల్గొన్నారు.

బాలమ్మ మృతి పట్ల సంతాపం

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బండారు బాలమ్మ(70)అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. బాలమ్మ మృతిపట్ల టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ మార్నేని మాలకొండయ్య, బిల్డర్ వెంకటేశ్వర్లు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మార్నేని రామకృష్ణ, బండారు రాజ, కందుల పిచ్చిరెడ్డి, చీమలదిన్నె రవీంద్రబాబు, జింకా మధు, మన్నం సాయి తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలే మానవత సంస్థ అజెండా


మొక్కలు నాటుతున్న రామచంద్రారెడ్డి, తదితరులు

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టడమే అజెండాగా మానవాత సంస్థ ఏర్పాటు ముఖ్య లక్ష్యమని వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి చెప్పారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద బుధవారం పలు మొక్కలను నాటారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బండి రామదాస్, సంస్థ సభ్యుడు శేగు కృష్ణయ్యలను పరామర్శించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం సుబ్బిరెడ్డి, ఆర్ గోపి, ఎంఈవోలు కోటిరెడ్డి, కరుణకుమారి, సంస్థ చైర్మన్ కే రామిరెడ్డి, బీ జయరామిరెడ్డి, వీ వెంకటేశ్వరరెడ్డి, టీ రమేష్, మిరికెల నారాయణ, ఏ కొండారెడ్డి పాల్గొన్నారు.

హిందూ సమాజం ఏకమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం


మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ తిరుపతయ్య

తాళ్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజాన్ని ఏకం చేసి క్రమశిక్షణను పెంపొందించటమే రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ (ఆర్ఎస్ఎస్) లక్ష్యంఅని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ తిరుపతయ్య చెప్పారు. తాళ్లూరులోని బస్టాండ్ సెంటర్‌లో ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వంచారు. ముందుగా ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించి ఆర్ఎస్ఎస్ స్థాపనకర్త కేబీ హెగ్డేవార్, గురూజీ గోవర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వై.లక్ష్మీనారాయణ రెడ్డి, చందోలు రామారావు, మారం గోవిందరెడ్డి, శ్రీనివాసరావు సిద్ధాంతి, సాంబిరెడ్డి,సమరతసేవా సభ్యులు నల్లపాటి వెంకటేశ్వర్లు, హనుమారెడ్డి, పాల్వాది రవికుమార్ పాల్గొన్నారు.

తమ్మలూరులో పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు గ్రామంలో మూడు రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాయుడుపాలెం సర్పంచ్ గొర్రె శ్రీదేవిరాముడు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పలు వీధుల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్, ఎబేట్ పిచికారీ చేయించారు. వీధుల్లో చెత్తాచెదారాన్ని కూడా తొలగించారు.


మురుగును తొలగిస్తున్న కార్మికులు

నేడు టీడీపీ సమావేశం

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మహలక్ష్మీ మిల్క్‌ప్రొడక్ట్ డైరీలో మండల కేఎస్ఎస్ సభ్యులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ పట్టణ, గ్రామ పార్టీ అధ్యక్ష ఉపాధ్యక్ష, కార్యదర్శులు, కేఎస్ఎస్ సభ్యులు, బూత్ కమిటీ, క్లస్టర్ కమిటీ ఇన్‌చార్జిలు హాజరు కావాలని కోరారు.

11న ఎన్‌జీపాడులో విద్యా సదస్సు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ విద్యా సదస్సు నాగులుప్పలపాడులో ఈ నెల 11 తేదీన జరుగుతుందని జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలు - పాలకుల విధానాలు అనే అంశంపై జరిగే విద్యా సదస్సుకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీ శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

పీసీపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీదపల్లి శ్మశానవాటికలో ప్రజల అవసరాల నిమిత్తం ఆ గ్రామ సర్పంచ్ కరణం తిరుపతయ్య నూతనంగా బోరు వేయించారు. గతంలో అనేకమార్లు శ్మశానవాటికలో నీటి కోసం బోరు వేయించాలని ప్రజలు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. గ్రామప్రజల కోరిక మేరకు వెంగళాయపల్లి సర్పంచ్ తిరుపతయ్య బుధవారం బోరు వేయించారు. అంత్యక్రియల సమయంలో శ్మశానానికి వచ్చే ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే బోరు వేయించినట్లు సర్పంచ్ తెలిపారు.

వైద్యశాఖ మాస్ మీడియా అధికారి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారిగా బెల్లం నరసింహారావు బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో హెల్త్ ఎక్సటెన్షన్, ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడకు వైద్య శాఖ మీడియా అధికారిగా బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావును వైద్యశాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఉపాధి లక్ష్యంగా పనిచేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజాబాబు అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన విధానమన్నారు. అందుకు అనుగుణంగా యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి మార్గం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సెర్ప్, మోప్మా, నైపుణ్యాభివృద్ధి విభాగాలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. వృత్తి విద్యకాలేజీల్లో పారిశ్రామికకంపెనీలకు చెందిన యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం వస్తుందని చెప్పారు.

సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకెంతో మేలు

పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఫిరోజ్

కనిగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ అమలుతో ప్రజలకెంతో మేలు చేకూరనుందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ చెప్పారు. పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యవసాయ పరికరాల ధరలు చాలా తగ్గాయన్నారు. దీంతో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్గుతోందని చెప్పారు. అదేవిధంగా గృహనిర్మాణాలకు అవసరమైన సామగ్రితోపాటు వస్తువులు ఎంతో రేటు తగ్గాయన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఒక్కో హామీని సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని అభివృద్ధిని ఒక ఏడాదిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర నాయకులు జంషీర్, క్లస్టర్ ఇంచార్జి బుల్లా బాలబాబు, కోఆప్షన్ మాజీ సభ్యుడు షరీఫ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, 10వ వార్డు ఇంచార్జి మిన్నూ, నాగ, మురళీ, విజేత కళాశాల ప్రిన్సిపాల్ అరుణోదర్, ఏలూరి సుబ్బారావు పాల్గొన్నారు.


సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫిరోజ్, జంషీర్

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన

దొనకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0పై స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు కే మల్లికార్జున సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో మినహాయింపులు, ప్రయోజనాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు జీఎస్టీ 2.0పై స్పీచ్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షేక్ షమీమా ప్రథమ, ఎన్ పవన్‌పాల్ రాజ్ ద్వితీయ, జీ వర్షిణీ తృతీయ బహుమతులకు ఎంపిక కాగా ప్రిన్సిపల్ ఎఫ్రాయిమ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా పాల్గొన్నారు.

నమశ్శివాయపురంలో వైద్యశిబిరం ఏర్పాటు

గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

పీహెచ్‌సీలో పీజీ వైద్య విద్యార్థుల వైద్య సేవలు

కురిచేడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నమశ్శివాయపురంలో సోమవారం డెంగ్యూ లక్షణాలతో 10వ తరగతి చదివే బాలిక మృతి చెందడంతో బుధవారం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆ గ్రామాన్ని సందర్శించారు. వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడారు. నమశ్శివాయపురంలో 10వ తరగతి చదివే బాలిక డెంగ్యూ లక్షణాలతో మృతి చెందడంతో గ్రామస్థులు ఆందోళనకు గురి అయ్యారు. కొద్దిమందికి జ్వరాలు కూడా ఉండటంతో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జ్వర పీడితుల వివరాలను సేకరించారు. వైద్య సిబ్బంది సమ్మెలో ఉండటంతో పీజీ వైద్య విద్యార్థులను వైద్య సేవలకు వినియోగిస్తున్నామని, రోగులు వారి సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ బాలిక మృతికి డెంగ్యూ కారణం కాదన్నారు. వైద్య సేవల లోపం వల్లనే బాలిక మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించామని, జ్వర పీడితులకు వైద్య సేవలు అందించడం తమ బాధ్యత అన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదనరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ బసవారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు

విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ముండ్లమూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి కష్టపడి చదువుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టీ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన బుధవారం సాయంత్రం ముండ్లమూరులోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తి గత పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించటానికి పీర్ గ్రూపును ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేశామన్నారు. ఈ పీర్ గ్రూపు లీడరు తరగతిలోని పిల్లలందరికీ ఆరోగ్య విద్యపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం కళాశాలలో వంట గది, స్టోర్స్ రూమ్‌ను పరిశీలించారు. ప్రిన్సిపల్ ఆవుల సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో అంతర్జాతీయ అక్షర దినోత్సవం


మాట్లాడుతున్న ఎంఈవో కాలేషావలి

ముండ్లమూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం, టాలెంట్ టెస్ట్, 9, 10 తరగతులు, జూనియర్లు 6, 7, 8 తరగతులు రెండు విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. వేముల హైస్కూల్ విద్యార్థులు అన్నపురెడ్డి లావణ్య, గుంటుపల్లి వేదన ప్రసూన మండల స్థాయిలో రెండు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఒంగోలులో జిల్లా స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌లో వీరు పాల్గొంటారని ఎంఈవో షేక్ కాలేషావలి తెలిపారు. కార్యక్రమంలో వేముల హెచ్‌ఎం తాన్య, సోషల్ అసిస్టెంట్ మాడావత్ శ్రీను నాయక్‌లను అభినందించారు.

పాఠశాలను తనిఖీ చేసిన యారవ

పామూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పడమట కట్టకిందపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను నియోజకవర్గ టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యత, ఉపాధ్యాయుల హాజరు శాతం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడినభోజనం పెట్టాలని సూచించారు. పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న యారవ

ఉప్పుగుండూరు పంచాయతీ పాలకవర్గాన్ని రద్దు చేయాలి

- ప్రత్యేకాధికారిని నియమించాలి
- గ్రామస్థుల నిరసన

నాగులుప్పలపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు గ్రామంలోని సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, కనీసం సమావేశాలు సైతం నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. బుధవారం వారు గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులతో కలిసి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును సమస్యలపై నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరి 19న జరిగిన పాలకవర్గ సమావేశం తర్వాత జరగాల్సిన సమావేశాలకు సర్పంచ్, ఇతర వార్డు సభ్యులు ఎవరూ హాజరుకాలేదని, తద్వారా గ్రామాభివృద్ధి కుంటుబడిందన్నారు. పారిశుధ్య అధ్వానంగా ఉందని, సైడుకాలువల్లో మురుగు పేరుకుపోయిందని, రోడ్లపై చెత్తచెదారం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు, విషపురుగులు విజృంభిస్తున్నా పంచాయతీ పాలకులు కానీ, అధికారులు గాని పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. తాగునీటి చెరువులోని నీరు కలుషితంగా మారి దుర్వాసన వస్తోందని, ఫిల్టర్‌బెడ్‌లు అపరిశుభ్రంగా మారాయని మండిపడ్డారు. నిధులు సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. ఉత్తమ పంచాయతీగా అవార్డులు అందుకొన్న ఉప్పుగుండూరులో గ్రామ పాలన మితిమీరిన రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తంగా మారిందని ధ్వజమెత్తారు. నిధుల దుర్వినియోగంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థుల నిరసన విషయం తెలుసుకున్న ఎంపీడీవో రవికుమార్ ఉప్పుగుండూరు పంచాయతీ వద్దకు వచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, పంచాయతీ పాలకవర్గం తీరుపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పాలకవర్గాన్ని తక్షణమే ఉన్నతాధికారులు రద్దు చేయాలని, ప్రత్యేకాధికారిని నియమించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు తెలగతోటి జాన్సన్, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కనగాల కృష్ణ, సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్, నలతోటి రామారావు, గుమ్మడి చిన్నా, బెల్లం శేషారావు, బీమవరపు శివ, గోగినేని శేషగిరి, కాకాని సుబ్బారావు, ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు, కొలకలూరి రమేష్ పాల్గొన్నారు.


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు




బాపట్లలోని రాజీవ్ గాంధీకాలనీలో అక్రమ లేఅవుట్

95 అక్రమ లే అవుట్లకు 42 దరఖాస్తులు

- క్రమబద్ధీకరణకు ఈ నెల 24 వరకే అవకాశం

బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశం ఈ నెల 24తో గడువు ముగియనున్నది. బాపట్లలో 95 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించగా ఇప్పటి వరకు 42 లేఅవుట్ల నిర్వాహకులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 53 లేఅవుట్ల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. గడువులోగా అందరూ ఆన్‌లైన్‌లో తగిన రుసుము చెల్లించి క్రమబద్ధీకరణకు చేసుకోవాలని అధికారులు తెలియజేస్తున్నారు. గతంలో క్రమబద్ధీకరణకు 14 శాతం ఫీజులు ఉండగా ప్రస్తుతం 7 శాతానికి తగ్గించారు. బాపట్లలోని సుమారు 250 ఎకరాల్లో 95 అక్రమ లేఅవుట్లలో వెంచర్లు వేశారు. అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రస్తుతం ముందుకు వస్తున్నారు. 7శాతం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ప్లాన్ ఇస్తామని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. క్రమబద్ధీకరణతో బ్యాంక్ రుణాలు కూడా పొందే అవకాశం ఉంటుందన్నారు.

రహదారులకు మోక్షం

- ఎమ్మెల్యే ఏలూరి చొరవతో రూ.13.80 కోట్లు మంజూరు



పర్చూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో రహదారులకు మోక్షం కలుగుతోంది. గత వైసీపీ హయాంలో రోడ్లు అధ్వానంగా తయారవగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోక ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పలు వ వారాల్లో కలిసి నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితిని విన్నవించారు. దీంతో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.13.80 కోట్లు మంజూరు చేసింది.

నిధులు ఇలా..

- బాపట్ల - పర్చూరు రోడ్డు అభివృద్ధికి రూ.5 కోట్లు
- గన్నవరం - మార్టూరు రోడ్డుకు రూ.2.80 కోట్లు,
- పూనూరు - గన్నవరం రోడ్డుకు రూ.3 కోట్లు
- మార్టూరు - ద్రోణాదుల రోడ్డుకు రూ.3 కోట్లు

అర్హులకే.. అవకాశం

పేదరికాన్ని రూపుమాపి తద్వారా రాష్ట్రాన్ని సంపన్నవంతం.. ఆరోగ్యవంతం.. ఆనందంగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 ప్రవేశపెట్టి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అయితే ఇందులో అర్హులకే అవకాశం దక్కేలా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ ప్రకారం మూడు నెలలుగా ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. పథకం ప్రారంభించినప్పుడు బంగారు కుటుంబాల ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఎంపికకు ఐదు అంశాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. సచివాలయ సిబ్బంది వాటి ఆధారంగానే ఇంటింటి సర్వేను మరోమారు చేపట్టి అర్హుల జాబితా ను యాప్‌లో అప్‌లోడ్‌తో పాటు, తొలి జాబితాలో చేర్చిన కొన్ని కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. ఎట్టకేలకు పీ-4 పథకానికి అర్హులైన బంగారు కుటుంబాల జాబితా సిద్ధమైంది.

- బంగారు కుటుంబాల జాబితా సిద్ధం
- ఐదు అంశాల ప్రామాణికంగా పీ-4 సర్వే
- ముమ్మరంగా మార్గదర్శకుల అనుసంధానం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకునేలా.. వారిని సమాజం దత్తత తీసుకుని ఆదుకునేలా పీ-4ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకం ఫలాలు అర్హులైన వారికే అందాలని, దాని కోసం ఐదు అంశాలు ప్రామాణికంగా ఇంటింటి సర్వేను చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఆ కుటుంబాలను మార్గదర్శకాలకు అనుసంధానం చేసే ప్రక్రియను సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం కుటుంబాల మ్యాపింగ్ పూర్తయిందని, వారి వారి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మార్గదర్శకులను అటాచ్ చేస్తున్నామని, ఆ ప్రక్రియ మరో వారం రోజుల్లో ఓ కొలిక్కి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సచివాలయాల వారీగా బంగారు కుటుంబాల జాబితాను గతంలో గ్రామా లు, మండలాలు, మున్సిపాలిటీలు వారీగా సిద్ధం చేశారు. అయితే ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించకపోవడంతో జిల్లాలో అనర్హులు పెద్ద సంఖ్యలో చేరారని తేలింది. ఈ పరిస్థితుల్లో అర్హులను ఎంపిక చేసేలా ప్రభుత్వం ఐదు అంశాలను నిర్దేశించింది. ఈ ప్రకారం బంగారు కుటుంబాల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలని, ఇదంతా కూడా పారదర్శకంగా (మిగతా 6వ పేజీలో)

తగ్గిన బంగారు కుటుంబాలు

బాపట్ల జిల్లాలో సర్వే అనంతరం తుది జాబితాలో 51,304 బంగారు కుటుంబాలకు చోటుదక్కింది. పథకం ప్రకటించిన తొలినాళ్లలో జిల్లా వ్యాప్తంగా 70,983 కుటుంబాలకు పీ-4లో చోటు కల్పించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో 15,179 కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. జిల్లాలో 5,158 మందిని మార్గదర్శకులుగా గుర్తించారు. గుంటూరు జిల్లాలో గతంలో 78 వేలు బంగారు కుటుంబాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 48 వేలకు పరిమితమైంది. పల్నాడు జిల్లాలో 76800 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. మూడు జిల్లాల్లో గతానికి ఇప్పటికీ బంగారు కుటుంబాల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది.


అద్దంకి కట్టకిందపాలెం నుంచి ఇందిరానగర్ వరకు నిర్మించనున్న డ్రెయిన్

అద్దంకిలో సీసీ డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు

అద్దంకి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో దళితులు నివాస కాలనీలలో అభివృద్ధి పనులకు రూ.3 కోట్లతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధితో పాటు శ్మశానాలకు ప్రహరీల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కట్టకిందపాలెం నుంచి ఇందిరానగర్‌లో పాత దర్శి రోడ్డు వరకు డ్రెయిన్ లేక మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కొంతమేర సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే మిగిలిన ప్రాంతంలో కూడా ప్రస్తుతం మంజూరైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పూర్తి స్థాయిలో డ్రెయిన్ నిర్మాణం చేయనున్నారు. చెరువుకొమ్ముపాలెం రోడ్డు, గుండ్లకమ్మ ఊటబావులకు వెళ్లే రోడ్డుల్లోని శ్మశానాలకు చుట్టూ ప్రహరీలను నిర్మాణం చేయనున్నారు. అదేవిధంగా దళిత కాలనీలలో అసంపూర్తిగా ఉన్న, శిథిలావస్థకు చేరిన సీసీ డ్రెయిన్లతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు.


చెరువుకొమ్ముపాలెం రోడ్డులో ఎస్సీ శ్మశాన వాటిక

ఏఎన్‌యూ వీసీగా.. ఆచార్య సత్యనారాయణరాజు

హిందూ బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా సేవలు



ఏఎన్‌యూ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య ఎస్.వెంకట సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ సత్యనారాయణరాజు నియామకానికి సంబంధించిన జీవో 91ను బుధవారం జారీ చేశారు. 14 నెలల తర్వాత ప్రభుత్వం పూర్తి స్థాయి ఉపకులపతిని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల వీసీలుగా ఐఐటీ, ఎన్‌ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఆచార్యులకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావును కాదని ఆచార్య సత్యనారాయణరాజును నియమించింది. సత్యనారాయణరాజు ప్రస్తుతం వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎంటమాలజీ ఆచార్యులుగా (ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్) సేవలందిస్తున్నారు. ఏఎన్‌యూ ఉపకులపతిగా ఆయన బుధవారం నుంచి మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన ఉపకులపతి ఆచార్య సత్యనారాయణరాజును పలువురు అభినందించారు.

పరిశోధనలు.. అవార్డులు..

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఆచార్య సత్యనారాయణ రాజు విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెరుగైన పరిశోధనలు చేస్తూ పలు అవార్డులను అందుకున్నారు. ఆయన 2017లో ఎన్విరాన్మెంటల్ కన్జర్వేషన్ అవార్డును, మహిమ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును, ఉత్తమ ఏఎన్‌ఓ అవార్డును, 2018లో డాక్టర్ ఆనంద్ ప్రకాష్ అవార్డును, ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డును, 2019లో అగ్రికల్చరిస్ట్ అచీవ్మెంట్ అవార్డును అందుకున్నారు. అలాగే ఆయన న్యూఢిల్లీలోని ఫెలో ఆఫ్ ఎంటమాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాగా పనిచేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సభ్యులుగా కూడా పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు ప్రచురించడంతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి

సూపర్ సేవింగ్స్ సదస్సులో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

పిట్టలవానిపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని చందోలులోని ప్రభుత్వ బాలికల కళాశాలలో బుధవారం జరిగిన సూపర్‌జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. వస్తువుల ధరల తగ్గింపుపై తల్లిదండ్రులకు విద్యార్థులు వివరించాలన్నారు. అంకితభావంతో విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. సూపర్ జీఎస్టీపై వ్యాసరచన, డ్రాయింగ్, పోస్టల్ మేకింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మురళీకృష్ణ, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో దాసరి వెంకటశివకుమార్, పంచాయతీ కార్యదర్శి బండ్లమూడి సుజాత, వీఆర్వో అరుణ ప్రసన్న, గుంటూరు బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


సూపర్ జీఎస్టీపై విద్యార్థులు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల: వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు.

అందుబాటులో 280 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో 280 మెట్రిక్ టన్నులయూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. ఆర్ఎస్‌కేలు, 26 సొసైటీల ద్వారా 345 మెట్రికట్ టన్నుల యూరియాను 3,789 మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 280 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

లీకులతో.. తాగునీరు కలుషితం

తూతూమంత్రంగా మరమ్మతులు

మున్సిపల్ అధికారులకు సవాల్‌గా లీకుల కట్టడి

బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో తాగునీటి సరఫరాలో అవాంతరాలు నెలకొంటున్నాయి. అడుగడుగునా లీక్‌లతో నీరు వృథా అవుతున్నది. లీకులు ఏర్పడిన చోట తాగునీరు ఉబికి వస్తోంది. దీనివల్ల ఆ ప్రాంతంలో ఉన్న మట్టి, మలినాలు తాగునీటిలో కలిసి కలుషితమౌతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన పది రోజుల్లో మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉప్పరపాలెం వెళ్లే సీసీరోడ్డు కింద పైపులైన్ లీకుతో రోడ్డు పగలగొట్టి గుంత తవ్వి మరమ్మతులు చేశారు. ఆతర్వాత జీబీసీ రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురు పైపులైన్‌లు లీకులు ఏర్పడి రోడ్డు ధ్వంసమైంది. రోడ్డుపైకి నీరువస్తుండటంతో దానికి మరమ్మతులు చేశారు. ఈప్రాంతంలో ఇప్పటికే 10 సార్లు పైపులైన్ లీకులు ఏర్పడ్డాయి. అయినా శాశ్వత పరిష్కారం చూపడంలేదు. ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే గడియారస్తంభం సెంటర్‌లో పైపులైన్ లీకు ఏర్పడి నీరు ఉబికి పైకి ప్రవహిస్తున్నది. దీంతో రోడ్డును పగలకొట్టి మరమ్మతులు చేసే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. దాని పక్కనే నాలుగురోజుల క్రితం పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. మళ్లీ ఆ పక్కనే పెద్దఎత్తున లీకులు వచ్చాయి. ఈ లీకులకు మరమ్మతులు చేయడం మున్సిపల్ అధికారులకు సవాల్‌గా మారింది. కారుమూరి హనుమంతరావు కాలనీలో సీసీరోడ్డు పక్కనే పైపులైన్ పగిలి నీరంతా పొంగి రోడ్డుపై కాల్వలా ప్రవహిస్తున్నది. లీకుల వల్ల తాగునీరు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేకప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభించి ప్రజలు అల్లాడుతున్నారు.


పైపులైన్ లీక్‌లకు మరమ్మతులు చేసేందుకు తవ్వుతున్న గుంత


కారుమూరి హనుమంతరావు కాలనీలో పైపులైన్ లీకై రోడ్డుపైకి ప్రవహిస్తున్న తాగునీరు

నల్లవాగు కనుమరుగు

- కొణిదెనలో 54 ఎకరాల ఆక్రమణ
- ఇష్టారాజ్యంగా భూముల్లో గ్రానైట్ వ్యర్థాలు

బల్లికురవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పలు మండలాలల్లోని సాగు భూములకు నీరు అందించే నల్లవాగులో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. గతంలో ఎంతో వెడల్పుగా ఉన్న వాగు ప్రస్తుతం అనవాళ్లు కోల్పోయింది. బల్లికురవ మండలం కొణిదెనలోని నల్ల వాగుకు సంబంధించి సర్వే నెంబరు 789/ ఏ, 789/ బీ, 761లో 54 ఎకరాల ప్రభుత్వ భూమిని కొణిదెనకు చెందిన కొందరు ఆక్రమించేశారు. ఆ భూముల్లో కొందరు పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు అమ్మకాలు చేసినట్లు సమాచారం. గ్రానైట్ ఫ్యాక్టరీలు నిర్వహించే కొందరు వ్యాపారులు కొంత కొనుగోలు చేసి, మరికొంత ఆక్రమించుకుని పెద్దఎత్తున వ్యర్థాలను పడేస్తున్నారు. ఫ్యాక్టరీలలో వచ్చే వ్యర్థాల్ని వాగు భూమిలో పడేస్తున్నారు. దీంతో నల్లవాగు రోజురోజుకు కుచించుకుపోతుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూముల అమ్మకాల విషయం తెలిసినా మామూళ్ల మత్తులో పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. బల్లికురవ నుంచి కొణిదెనకు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న వాగు భూమిలో వ్యర్థాలతో సమీప పొలాల్లో పంటలు కూడా సరిగా పండటంలేదని రైతులు వాపోతున్నారు. ఎత్తిపోతల పథకం, దిగువన చెక్‌డ్యాంల నుంచి పంటలకు నీరు సక్రమంగా రావాలంటే నల్లవాగు ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.


నల్లవాగు భూమిని ఆక్రమించుకుని గ్రానైట్ వ్యర్థాలు


సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో కౌన్సెలింగ్

చిన్నారి పెళ్లికూతుళ్లు

- పల్లెల్లో పెరిగిపోతోన్న బాల్య వివాహాలు
- అవగాహన లేమితో కొన్ని, మూర్ఖత్వంతో మరికొన్ని..

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా.. విద్యావకాశాలు మెరుగైనా.. ఇప్పటికీ పల్లెల్లో చిన్నారి పెళ్లిళ్లు పెరిగిపోతున్నాయి. ఆట పాటలతో గడపాల్సిన ప్రాయం మూడు ముళ్ల బందీఖానాలోకి చేరిపోతోంది. పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన బాలికలు పెళ్లి అనే బంధంతో జీవచ్ఛవాల్లా మారుతున్నారు. నేటి ఆధునిక యుగంలో కూడా జిల్లాలోని అనేక పల్లెల్లో పాతకాల పద్ధతులను ఆచరిస్తూ బాల్య వివాహాలు చేస్తున్నారు. పెద్దలు అవగాహన లోపంతో కొన్ని, మూర్ఖత్వంతో మరి కొన్ని జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అభం శుభం తెలియని 12 లేక 13 ఏళ్ల బాలికలు పెళ్లిళ్లు చేసుకుని గర్భందాల్చుతున్నారు. ఐసీడీఎస్, సఖీ వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా బాల్య వివాహాలు ఆగడం లేదు. పిల్లల ఆనందంతో పనిలేకుండానే పెద్దలు వారి ఆర్థిక, ఇతర కుటుంబ సమస్యల కారణంగా పెళ్లిళ్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పాతికేళ్లకే ఇద్దరు, ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి(దాదాపుగా కాన్పులన్నీ ఆపరేషన్‌లే) యుక్త వయసులోనే ఆరోగ్యంపై పట్టు తప్పుతున్నారు.

సఖీ.. కౌన్సెలింగ్..

బాల్య వివాహాల సమాచారంతో అవకాశం ఉన్న మేరకు ఐసీడీఎస్, సఖీ వన్‌స్టాప్ సెంటర్ల నిర్వాహకులు వాటిని అడ్డుకుంటున్నారు. ఇటీవల చీరాల మండలంలో ఓ బాల్య వివాహాన్ని నిలిపి రెండు రోజుల పాటు సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లోనే ఉంచి కౌన్సెలింగ్ చేశారు. అయినా ఏదో ఒక మూల వారంలో ఒక పెళ్లి కచ్చితంగా జరుగుతూనే ఉంది.

కౌన్సెలింగ్‌తో సమస్యకు పరిష్కారం



బాల్య వివాహాల నియంత్రణకు సఖీ వన్‌స్టాప్ సెంటర్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. సమస్యల పరిష్కారం కొరకు ఉమెన్ హెల్ప్‌లైన్ 181, 112, లేదా 08643 224922 ద్వారా సంప్రదించవచ్చు.

- కుమ్మరి ఉషారాణి, సఖీ వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ బాపట్ల

బాపట్ల రోడ్లకి రూ.14.45 కోట్లు


ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి రూ.14 కోట్ల 45 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కర్లపాలెం మండల కేంద్రం నుంచి పెదపులుగువారిపాలెం గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్ల 75 లక్షలు, మాచవరం నుంచి అల్లూరు వరకు రూ.6 కోట్లు, చందోలు బ్రిడ్జి దగ్గర నుంచి అల్లూరు బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, చందోలు నుంచి ఇంటూరు వరకు రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. మంజూరైన పనులకు త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.



ట్రాప్ కెమేరాలను ఏర్పాటు చేస్తున్న బీట్ ఆఫీసర్ నవీన్

చిరుత ఆచూకీ కోసం ట్రాప్ కెమెరాలు

వెలిగండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిరుత సంచార ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారి ఫారెస్ట్ ఉమామహేశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి గ్రామాల ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆచూకీ కోసం బుధవారం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అధికారులు అనుమానిత ప్రాంతాలను సందర్శించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. చిరుత పులి సంచరిస్తూ.. రైతులకు కనిపించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమారాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ పాల్గొన్నారు.



కలెక్టర్ రాజాబాబుకు మొక్క ఇస్తున్న సీడబ్ల్యూసీ చైర్మన్ రామాంజనేయులు

కలెక్టర్‌ను కలిసిన సీడబ్ల్యూసీ చైర్మన్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబును జిల్లా బాలల సంక్షేమ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్మన్ వేమే రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం కలెక్టర్ రాజాబాబుకు మొక్కను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పిల్లలరక్షణ, సంరక్షణ, పునరావాసం, సంక్షేమం, దత్తత ప్రక్రియ, పోస్టర్ కేర్, అఫ్టర్‌కేర్, చిల్డ్రన్స్ కేర్ తదితర అంశాలను ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పొన్నలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపాడు గ్రామంలో విద్యుదాఘాతంతో మనకే తిరుపాలు (49) బుధవారం మృతి చెందారు. తిరుపాలు తన మిత్రులతో కలిసి గ్రామంలో ఉన్న పాలేరు వాగుకు వెళ్లి చేపలు పట్టుకుని తిరిగి వస్తుండగా కాలికి కరెంట్ తీగ తగిలింది. దాన్ని చేత్తో పట్టుకొనగా కరెంట్ షాక్ తగిలి తిరుపాలు పడిపోయాడు. స్థానికులు ఆటోలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించగా డాక్టర్ పరీక్షించి తిరుపాలు మరణించినట్లు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందిచడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనుక్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

కేన్సర్ అనుమానిత కేసులను వైద్యాధికారికి బదలాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో అనుమానితులు ఉంటే వెంటనే సంబంధి వైద్యాధికారులకు రెఫర్ చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ సమావేశపుహాలులో బుధవారం ప్రోగ్రామ్ అధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో కేన్సర్ ఉన్నట్లు అనుమానాలు ఉంటే వెంటనే జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు సమాచారం అందించాలన్నారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు పోస్టర్లను జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

కబ్జా కాటు

రూ.100 కోట్ల విలువైన భూముల స్వాహా

ఆక్రమణల చెరలో దర్శిలోని కాటేరువాగు, జోమ్ కాలువ

చెలరేగిపోతున్న అక్రమార్కులు

వైసీపీ హయాంలో విచ్చలవిడితనం

జలదిగ్బంధం అవుతున్న లోతట్టు ప్రాంతాలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఏ ప్రభుత్వం వచ్చినా తొలుత హడావుడి..

ఆ తర్వాత అధికారులు మౌనం

దర్శి పట్టణంలోని కాటేరు వాగుతోపాటు జోమ్ కాలువ పరివాహక ప్రాంతాలు కబ్జా కోరల్లో నలిగిపోతున్నాయి. అవి ఆక్రమణలతో కుంచించుకుపోవటంతో వర్షాలు పడినప్పుడు సమీప ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. అంతేగాక ఆ ప్రభావంతో కొన్ని ప్రధాన రహదారులపై సైతం నీరు పోటెత్తి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్నేళ్లుగా దశల వారీగా ఆక్రమణలు సాగుతూ చివరకు వాగులు పూర్తిగా కనుమరుగయ్యాయి. సుమారు వంద కోట్ల రూపాయల విలువైన వాగుల భూములు అక్రమార్కులు స్వాహా చేసి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసినట్లు అంచనా. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలుత హడావుడి చేయటం ఆ తర్వాత వదిలేయటం షరామామూలైంది.

దర్శి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దర్శి-పొదిలి రోడ్డులోని కాటేరువాగు వంద ఎకరాలలో విస్తరించి ఉంది. వాగుకు ఇరువైపులా ఉన్న భూములను పూర్తిగా ఆక్రమించుకొని గృహాలు, ఇతర నిర్మాణాలు చేశారు. ప్రస్తుతం వరద ప్రవాహం లేక ఆ వాగు మురుగు కాల్వగా మారింది. సుమారు 80 ఎకరాలకు పైగా వాగు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. అక్కడ ఎకరం సగటున కోటి రూపాయలకు పైగా పలుకుతోంది. వాగు కుచించుకుపోవటంతో వర్షాలు పడినప్పుడు కిందకు నీరు వెళ్లే అవకాశం లేక దర్శి-పొదిలి రోడ్డు బ్లాక్ అవుతుంది. అక్కడ నీరు పోటెత్తి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

జోమ్ కాలువ పరిధిలో సుమారు 20 ఎకరాలు మాయం

అదేవిధంగా దర్శి పట్టణంలోని అద్దంకి జోమ్ కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురికావటంతో మురుగుకాల్వగా మారింది. వర్షాలు పడినప్పుడు ఈ కాలువకు వచ్చే నీరు కిందకు వెళ్లే వీలులేక వెలంవారివీధి, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లోని గృహల్లోకి నీరు చేరుతుంది. రోడ్లు జలమయం అవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షానికి శివాలయం వీధి, వెలంవారివీధి రోడ్లపై మూడు అడుగుల మేర నీరు చేరటంతో పాటు గృహల్లోకి నీరు చేరి సామాన్లు దెబ్బతిన్నాయి. రెండురోజుల తర్వాతగాని ఇళ్లలోకి చేరిన నీరు బయటకు పోలేదు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణం గల జోమ్ కాలువ ఇరువైపులా ఆక్రమణలు జోరుగా ఉండడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇక్కడ ఎకరా ధర రూ.2కోట్లకుపైగా పలుకుతోంది.

వైసీపీ హయాంలో శ్రుతిమించిన ఆక్రమణలు

కొన్నేళ్లుగా అధికారులు ప్రభుత్వ భూముల రక్షణ గురించి పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు విచ్చలవిడిగా జరిగిన విషయం తెలిసిందే. అంతకుముందు భయంభయంగా కొంతమేర ఆక్రమించిన అక్రమార్కులు వైసీపీ ప్రభుత్వంలో అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోయారు. అవకాశం ఉన్న మేరకు ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారు. కాటేరువాగు, జోమ్ కాలువ ఆక్రమణల చెరలో ఇరుక్కుపోవటం వలన వాటి సమీప ప్రాంత ప్రజలు వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బంది పడుతున్నారు.



ఆక్రమణలతో కుంచించుకుపోయిన కాటేరువాగు

మొత్తమ్మీద 200 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి కబ్జా

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్రమణలను తొలగిస్తారని ఆశించారు. ఇప్పుడు కూడా ఆక్రమణల తొలగింపు గురించి పట్టించుకోకపోవటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్శి- పొదిలి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డు, దర్శి-అద్దంకి రోడ్లల్లో మొత్తం 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైంది. ఆ భూములను ఆక్రమణల చెర నుంచి తొలగిస్తే అవసరమైన అన్నీ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి, ఇతర అవసరాలకు వీలుకల్గుతుంది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనువైన స్థలాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇప్పుడైనా అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అద్దెల వసూళ్లలో నిర్లక్ష్యం

భారీగా పేరుకుపోతున్న బకాయిలు

గడువు దాటిన గదులకు వేలం నిర్వహించని వైనం

పాత యజమానుల నుంచి అనధికార వసూళ్లు

మున్సిపాల్టీ అధికారుల తీరుపై అనుమానాలు

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మున్సిపాలిటీలు స్వయం సమృద్ధి సాధించాలి. ఎక్కడికక్కడ ఆదాయ వనరులను మెరుగుపర్చుకోవాలి. ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు సమీకరించుకోవాలి.' ఇవీ పురపాలకశాఖ ఉన్నతాధికారులు పలు సమీక్షల్లో ఇస్తున్న ఆదేశాలు. కానీ మార్కాపురం మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. అదనపు ఆదాయం పెంచుకునే మాట అటుంచితే ఇప్పటికే ఉన్న లక్ష్యాలను అందుకునేందుకే ఆపసోపాలు పడుతున్నారు. బకాయిల వసూళ్ల విషయంలో మున్సిపల్ రెవెన్యూ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రూ.లక్షల్లో బకాయిలు ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు పనిచేస్తున్నారు. అంతేకాక ఇప్పటికే గడువు తీరిపోయిన కొన్ని అద్దె దుకాణాల విషయంలో ఆ విభాగం అధికారులు, సిబ్బంది కొందరు చేతివాటం చూపుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని దుకాణాలకు వేలం నిర్వహించకుండా అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

పేరుకుపోయిన బకాయిలు

మార్కాపురం పురపాలక సంఘంలో మొత్తం 47 అద్దె దుకాణాలు ఉన్నాయి. వాటికి వేలం పాట నిర్వహించి అద్దెలు నిర్ణయించారు. అద్దె దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి ప్రతి సంవత్సరం రూ.48.35 లక్షల మేర ఆదాయం రావాలి. కానీ ప్రతి సంవత్సరం బకాయిలు ఉంటూనే ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి రూ.13 లక్షల మేర బకాయిలు దుకాణదారుల నుంచి రావాల్సి ఉంది. సుమారు ఆరు నెలలు కావస్తున్నా ఇంకా ఆ బకాయిల్లో 50శాతానికి మించి వసూలు చేయలేదు. ప్రస్తుతానికి బకాయిలకు సంబంధించి రూ.6 లక్షలు ఇంకా వసూలు చేయాల్సి ఉంది. బకాయిలు, ప్రస్తుత డిమాండ్ మొత్తం కలిపి రూ.61.14 లక్షలు వసూలు చేయాల్సి ఉన్నా 40 శాతం మేర మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలిగారు. దుకాణాలకు సంబంధించి అద్దెలను ఎప్పటికప్పుడు ఏ నెలకు ఆ నెల వసూలు చేయాలి. మొత్తం 47 దుకాణాల్లో మున్సిపాలిటీ కార్యాలయం చుట్టే 40 వరకు ఉన్నాయి. రెవెన్యూ విభాగంలో తగినంత మంది సిబ్బంది ఉన్నా నెలనెలా అద్దెలు వసూలు కావడం లేదు. ఆర్థిక సంవత్సరం చివర్లో హడావుడి చేసి మమ అన్పిస్తున్నారు.



మార్కాపురం కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మున్సిపాలిటీ అద్దె దుకాణాలు

గడువు దాటిన దుకాణాలకు వేలం ఎప్పుడు..?

మున్సిపాలిటీ పరిధిలోని 47 దుకాణాల్లో ఈ మధ్యనే తొమ్మిదింటికి గడువు దాటింది. వాటికి బహిరంగ వేలం నిర్వహించి కేటాయించాల్సి ఉంది. కానీ మున్సిపాలిటీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కొందరు సిబ్బంది పాత యజమానుల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. వాటికి వేలం నిర్వహించకుంటే చేతివాటం చూపుకునేందుకు అవకాశం ఉంటుంది కాబట్టే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని నెలనెలా అద్దెలు చెల్లించే దుకాణ యజమానులు చర్చించుకుంటున్నారు. అంతేకాక కొందరు తాము అధికారపార్టీకి చెందిన వాళ్లము కాబట్టి మా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తామని అద్దెలు చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. మరికొందరు వేలంలో దుకాణాలు దక్కించుకుని సబ్ లీజుకు ఇచ్చుకుని నెల నెలా అద్దెలు తీసుకుంటున్నా మున్సిపాలిటీకి మాత్రం సక్రమంగా చెల్లించడం లేనట్లు సమాచారం. అద్దెల వసూళ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తేనే బకాయిలు తగ్గే అవకాశం ఉంది.

నకిలీలపై అప్రమత్తమైన ఎక్సైజ్

● విస్తృత తనిఖీలకు ఆదేశం

● పాత నేరస్థులపై నిఘా

● అధికారులకు దిశానిర్దేశం చేసిన డీసీ

ఒంగోలు క్రైం,అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ యూనిట్ బయటపడటంతో ఆ శాఖ ఉలిక్కిపడిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆరు నెలల క్రితం కందుకూరులో నకిలీ మద్యం భారీగా దొరికింది. కందుకూరు జిల్లా సరిహద్దులలో ఉండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. కందుకూరు పరిసర జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదేశించారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్థానిక డీసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నకిలీ మద్యం విషయాన్ని సీరియస్‌గా తీసుకుని పనిచేయాలన్నారు. మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, క్లాసిక్ బ్లూ, కేరళ మాల్ట్, మంజీర బ్రాండ్ల గురించి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా స్పిరిట్ యూనిట్ల నిల్వలను కూడా పరిశీలించాలని సూచించారు. టంగుటూరు మండలం పసుముద్రలో నకిలీ మద్యం తయారీ కేంద్రం గతంలో నడిచిన విషయాన్ని ప్రస్తావించి దానికి సంబంధించిన నేరస్తులపై కూడా నిఘా ఉంచాలన్నారు. అదేక్రమంలో అన్ని మద్యం దుకాణాలతోపాటుగా, అనుమానిత ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, ఈఎస్ ఆయేషా బేగం పాల్గొన్నారు.

అర్హులకే.. అవకాశం

(5వ పేజీ తరువాయి)

జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు మూడు నెలల పాటు జరిగిన ఇంటింటి సర్వే ఇటీవలే ఓ కొలిక్కి వచ్చింది. దీంతో బంగారు కుటుంబాల జాబితాపై స్పష్టత వచ్చింది. దీంతో పీ-4కు అనర్హులుగా తేలుస్తూ ఆయా కుటుంబాల వివరాలను యాప్‌లో నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టారు. గతంలో ఒక్కో మార్గదర్శకుడికి కనీసం పది బంగారు కుటుంబాలను అప్పగించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే ప్రస్తుతం వారి ఇష్టం ఆధారంగా ఒక బంగారు కుటుంబాన్ని కూడా పీ-4 పథకం కిందకు చేర్చనున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన...

తుది జాబితాలో చోటు దక్కించుకున్న బంగారు కుటుంబాలకు ప్రభుత్వం వైపు నుంచి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై తొలి దశ కసరత్తుపై యంత్రాంగం దృష్టి సారించింది. సాంకేతిక కారణాల వల్లనో లేక అవగాహన లేమితో వారు దరఖాస్తు చేసుకోకపోవడం వల్లనో పథకాలకు దూరంగా ఉంటే వారిని ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలో చేర్చనున్నారు. మలి దశలో భాగంగా మార్గదర్శకుల ద్వారా వారికి ఏ విధమైన తోడ్పాటు అందించాలో ఓ స్పష్టతకు రానున్నారు. తర్వాత మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను ఒకే వేదిక మీదకు తెచ్చి అనుసంధానం చేసే కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులకు అధికారులు అప్పగించారు. ప్రస్తుతం పీ-4 జాబితా తుది రూపు తీసుకోవడం, మ్యాపింగ్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో తర్వాత ప్రక్రియలపై వడివడిగా అడుగులు పడుతున్నాయి.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

మార్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వడ్డె బజార్‌లోని కోటపాటి ప్రశాంత్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను టౌన్ పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పట్టణ పోలీసులు వడ్డె బజారులో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రశాంత్ ఇంట్లో అక్రమంగా బాణసంచా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రశాంత్‌ను అరెస్టు చేసి, మతాబులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదుబాబు తెలిపారు. బాణసంచా విలువ రూ.లక్షపైనే ఉంటుందని తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

● దీపావళి నాటికి 8,839 గృహాలను పూర్తిచేయాలి ● కలెక్టర్ రాజాబాబు అదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు.. అధికారులను అదేశించారు. అందుకు అనుగుణంగా జిల్లాలో కేటాయించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం పీఎంఏవై, పీఎం జన్‌మన్ పథకాల పురోగతిపై గృహ నిర్మాణశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాటాడారు. ముందుగా ఆయా పథకాల ద్వారా జిల్లాలో గృహ నిర్మాణాల మంజూరు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలను ఆశాఖ పీడీ శ్రీనివాస ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ దీపావళి నాటికి 8,839 గృహాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినందున అందుకు అనుగుణంగా ఆయాగృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అదేశించారు. హౌసింగ్ స్కీంలో ఆప్షన్-3 కింద లబ్ధిదారులుగా ఉన్న వారికి కూడా కాంట్రాక్టర్లు త్వరగా ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతిలేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఇతర అధికారులు ఉన్నారు.



వీఆర్వో కుమారుడిపై కేసు

● ఆర్మీ జవాన్ నుంచి నగదు వసూలు ● బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి ● పోలీసుల అదుపులో నిందితుడు

పీసీపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : తండ్రి ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని షాడో వీఆర్వోగా చెలామణి అవుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి అందిన మేర దండుకుంటున్న వీఆర్వో తనయుడిపై పీసీపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు... పెదయిర్లపాడు గ్రామానికి చెందిన అద్దంకి విజయ్(ఆర్మీ జవాన్) అతని కుటుంబ సభ్యులు రామయ్య, బాలయ్య, సుందరం, దావీదు, వినోద్ బాబు, పేరయ్య, విశ్రాంతమ్మలకు సర్వేనెంబరు 1769/2, 255, 1619/2, 1430/2, 735/1లో భూములు ఉన్నాయి. ఆ భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాల కోసం ప్రస్తుతం పెదఅలవలపాడు వీఆర్వోగా పనిచేస్తున్న సుబ్బారావు 2023లో పెదయిర్లపాడు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనను సంప్రదించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వీఆర్వో తనయుడు సత్యనారాయణ అలియాస్ సత్యం తాను పాసుపుస్తకాలు చేయిస్తానని, అందుకు రూ.3.10లక్షలు ఖర్చు అవుతుందని విజయ్ అతని కుటుంబసభ్యుల నుంచి నగదు తీసుకున్నాడు. అందులో రూ.1.40లక్షలు ఆర్మీ జవాన్ విజయ్ నుంచి ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. నగదు తీసుకున్నప్పటికీ పాసుపుస్తకాలు ఇవ్వలేదు. ఆలస్యమయ్యేకొద్దీ బాధితుడు విజయ్ వీఆర్వో తనయుడిపై ఒత్తిడి చేయగా ఈ ఏడాది జూన్‌లో తానుతీసుకున్న నగదులో 80వేల రూపాయలను తిరిగి ఇచ్చేశాడు. అప్పటినుంచి మిగిలిన నగదు ఇవ్వాలని అడుగుతున్నా చెల్లించకపోగా ఆర్మీ జవాన్ విజయ్‌ను మీరు ఏం చేసుకుంటారో చేసుకోమని సత్యం బెదిరింపులకు దిగాడు. బాధితుడు విజయ్ ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీఆర్వో తనయుడు సత్యనారాయణ అలియాస్ సత్యంపై ఎస్సై కోటయ్య చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం రాత్రి అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● అభివృద్ధి. సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం ● మంత్రి బాలవీరాంజనేయ స్వామి ● ఘనంగా ఒంగోలు ఏఎంసీ ప్రమాణ స్వీకార మహోత్సవం



ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, దానిని ఓర్వలేని వైసీపీ... ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలను తిప్పి కొట్టి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఒంగోలులో ఘనంగా జరిగింది. స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మంత్రి స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికై రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ స్పీడుతో దూసుకెళుతుందన్నారు. ఎన్నికలకు ముందుగా చెప్పిన ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రూ.2వేలు ఉన్న పింఛన్లను వైసీపీ ప్రభుత్వం రూ.3వేలకు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజే రూ.4వేలకు పెంచిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్‌పై వైసీపీ అబద్ధపు ప్రచారం చేస్తోందని, దీనిని ప్రతి ఒక్కరు తిప్పికొటాలని అన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన చేపడుతుండగా, వైసీపీ అనవసరమైన నిరసనలతో అబద్ధపు మాటలతో ప్రజలను పక్కదారి పట్టిస్తోందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు తప్పకుండా వస్తాయన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, సమష్టిగా కృషితోనే కూటమి విజయం సాధ్యమైందని తెలిపారు. పదవులు రాలేదని అసంతృప్తి చెందవద్దని సమయం వచ్చిపుడు తప్పకుండా పదవులు వస్తాయని తెలిపారు. గత వైసీపీ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆ విషయం తాను మర్చిపోనని, అందరికీ న్యాయం చేస్తానని తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అభివృద్ధివైపు అడుగులు వేస్తుందని తెలిపారు. ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు ఏడు మునిసిపాలిటీలలో అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. దామచర్ల సత్య మాట్లాడుతూ రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం అన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కోసం, రూపు రేఖలు మార్చిన ఘనత సోదరుడు దామచర్ల జనార్ధన్‌కు దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు జిల్లా నుంచే మొదలుతాయని తెలిపారు. టీడీపీ సత్తా ఏమిటో గతంలో ఒంగోలులో జరిగిన మహానాడుతో నిరూపించడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. దామచర్ల నేతృత్వంలో ఒంగోలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. కనిగిరి శాసనసభ్యులు కనిగిరి ఉగ్ర నరసింహారెడ్డి, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, వై.పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, జనసేన నాయకులు కంది రవిశంకర్, పలువురు పార్టీ శ్రేణులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను మరింతగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అంతకముందు నగరంలోని మినీ స్టేడియం నుంచి ఏ1 ఫంక్షన్ హాలు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఒంగోలు వ్యసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా చిట్టెం వెంకట దుర్గా ప్రసాద్‌రావు, సభ్యులుగా ఉలిచి నందకుమార్‌రెడ్డి, సింగోతు కృష్ణ కుమారి, సూదనగుంట శ్రీనివాసరావు, గంగవరపు సందీప్, రేపూరి నాగమణి, యాదల కోటేశ్వరమ్మ, నుసుం ఆదిలక్ష్మి, నత్తల అనిత, బొద్దులూరి సోభ, ముత్యాల సుజాత, షేక్ అమురుల్లా, పప్పు శ్రీనివాసరావు, ఆకుతోట వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నూతన కమిటీని అభినందించారు.

అవీ.. ఇవీ



కమిటీ ప్రతినిధులతో
మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు

గడియార స్తంభం పనులకు ప్రణాళిక

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గడియార స్తంభం నిర్మాణానికి అన్నిరకాల ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు స్పష్టం చేశారు. బుధవారం గడియార స్తంభం సాధన కమిటీ ప్రతినిధులు చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈక్రమంలో ఏళ్ల తరబడి ఎందరికో ఆనవాళ్లను తెలియజేసే గడియార స్తంభం తొలగింపుపై విచారం వ్యక్తం చేశారు. అయితే నూతనంగా మళ్లీ కూటమి ప్రభుత్వంలో గడియార స్తంభం ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షలతో నిర్మించేందుకు కౌన్సిల్ ఆమోదం జరిగిందని వివరించారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు అధునాతనంగా ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కమిటీ దృష్టికి వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సర్విశెట్టి సుబ్బరామయ్య, పుల్లయ్య నాయుడు, వడ్లమూడి ఆదినారాయణ, శ్రీనివాసరావు, వెంకటనారాయణ, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.



నాగులపాలెం వద్ద హైవే రోడ్డు ప్రాంతాన్ని
పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

నాగులపాలెం హైవే రోడ్డు పరిశీలన

● ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన హైవే యంత్రాంగం

పర్చూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారి మార్గంలో పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవటం, డ్రైనేజ్ కాలువ తక్కువ వెడల్పుతో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. దీంతోపాటు వరద సమయాల్లో పంటలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. గ్రామస్థులు, రైతుల సమస్యపై స్పందించిన ఏలూరి హైవే అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో బుధవారం హైవే అధికారులు, రైతులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వీస్ రోడ్డుతోపాటు, డ్రెయిన్ 6 మీటర్లు పెంచే విధంగా చర్యలు చేపడతామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధి అవిర్నేని శ్రీకాంత్, స్థానిక నేతలు కొల్లా శ్రీనివాసరావు, పోత్రు శోభన్, అడగడ్డ వెంకటేశ్వర్లు, హైవే అధికారి ఖాదర్ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద
హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరుపై హర్షం

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలో గన్నవరం నుంచి పూనూరు వరకు రోడ్డు మరమ్మతులకు రూ.3 కోట్లు, అదేవిధంగా గన్నవరం నుంచి మార్టూరు వరకు రోడ్డు మరమ్మతులకు రూ.2.80 కోట్లు నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ బుధవారం సాయంత్రం గన్నవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ కార్యకర్తలు,గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్అండ్‌బీ రోడ్లను ఆధునీకరించే పనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డిల సహకారంతో నిధుల మంజూరుకు ఏలూరి కృషి చేశారు. దాంతో గ్రామస్థుల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.



పంగులూరు ఉన్నత పాఠశాలకు
మైక్‌సెట్ అందజేస్తున్న పూర్వ ఉపాధ్యాయుడు శిరిగిరి శ్రీనివాసరావు

ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

పంగులూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):పంగులూరు ఉన్నతపాఠశాలకు పూర్వ ఉపాధ్యాయుడు శిరిగిరి శ్రీనివాసరావు మైక్‌సెట్ బహూకరించారు. శ్రీనివాసరావు తండ్రి హనుమంతరావు జ్ఞాపకార్థం రూ. 12,500ల విలువచేసే మైక్‌సెట్‌ను బుధవారం హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావుకు అందజేశారు. తమ పాఠశాలకు విలువైన మైక్‌సెట్ బహూకరించిన పూర్వ ఉపాధ్యాయులు శిరిగిరి శ్రీనివాసరావును హెచ్‌ఎంతో పాటు పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు తలపనేని రామాంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో రావి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ విద్యాసదస్సును జయప్రదం చేయండి

ఈనెల 11వతేదీన నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో ఏపీటీఎఫ్ మండలశాఖ నిర్వహిస్తున్న విద్యాసదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్), జిల్లా ఉపాధ్యక్షుడు చేజర్ల చెంచు రామారావు, కంకణాల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మండల ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరు కావాలని అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తస్నీరు వెంకటరావు, రహంతుల్లా కోరారు

మినీ గోకులాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

● ఏపీడీ బత్తిన సింగయ్య



గోపాలపురంలో పశువుల షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న
ఏపీడీ బత్తిన సింగయ్య

అద్దంకిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో మినీ గోకులం పథకానికి సంబంధించి షెడ్‌లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన గోకులం షెడ్‌లను పూర్తి చేసుకోవాలని చీరాల డివిజన్ ఏపీడీ బత్తిన సింగయ్య సూచించారు. బుధవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతు చీరాల డివిజన్ పరిధిలో 385 గోకులం షెడ్‌లు మంజూరు అయ్యాయన్నారు. వాటిలో 42 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశలల్లో ఉన్నాయన్నారు. అద్దంకి మం డలంలో మొత్తం 66 గోకులం షెడ్‌లు మంజూరు అయ్యాయని వాటిలో ఇప్పటికే 20 నిర్మాణంలో ఉన్నాయని మిగిలిన లబ్ధిదారులు త్వరగా షెడ్ పనులు ప్రారంభించుకోవాలన్నారు. ముందు కట్టుకున్న వారికి నగదు చెల్లింపులు చేయడం వెంటనే జరుగుతాయని, అందరూ త్వరగా నిర్మాణాలు చేపట్టుకోవాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలందరూ వారి జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసి తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లోని సంబంధిత ఎఫ్‌ఏ, మేట్‌లను సంప్రదించి ఉచితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులు చేయడానికి వీలవుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 25 శాతం ఈ కేవైసీ పూర్తి అయిందని, మరో రెండు రోజుల్లో 100శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీవో నాగ కోటేశ్వరి, ఈసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

● డీఈఈ జాన్‌థామస్



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ జాన్‌థామస్

చినగంజాం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చీరాల డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.జాన్‌థామస్ హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్‌థామస్, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆశాఖాధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 34 బృందాలుగా ఏర్పడి 68 మంది సిబ్బందితో 12 గ్రామాల్లో విద్యుత్ మీటర్ల నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగం, అదనపు లోడు తదితర వాటిని తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకుంటున్న 14 మందిపై కేసు నమోదు చేసి రూ.61,500లు, అదనపు లోడు వినియోగించుకుంటున్న 17 మందిపై కేసులు నమో దు చేసి రూ.1,41,000లు, వేరొక కేటగిరిలో విద్యుత్ వినియోగించుకుంటున్న 8 మందిపై కేసు నమోదు చేసి రూ.15,700లు అపరాధ రుసుం విధించినట్లు జాన్‌థామస్ తెలిపారు. 39 మందిపై కేసులు నమోదు చేసి రూ.2,18,200లు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మీటర్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేటపాలెం, చీరాల, పర్చూరు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.శ్రీనివాసరావు, బి.హరిప్రసాద్, జె.శ్రీనివాసరావు, చినగంజాం మండల విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏ.ఈ ఎల్.బ్రహ్మం, చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కార్యాలయాన్ని
తనిఖీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ

క్రమశిక్షణతోనే తరగతుల నిర్వహణ

● ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతోనే ఎన్‌సీసీ శిక్షణ తరగతుల నిర్వహణ జరగాలని ఏపీ,తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. బుధవారం చీరాల 23(ఏ) బెటాలియన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ దూబే, కమాండింగ్ అధికారి గోపాల్ త్రిపాఠీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ ఫార్మర్‌లతో కలిసి రికార్డులు పరిశీలించారు. శిక్షణ తరగతుల పురోగతిపై ఆరా తీశారు. ఎన్‌సీసీ కాలనీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ఏటీఎస్‌సీ -2025 కంటింజెంట్ కమాండర్‌గా వ్యవహరించి జాతీయ స్థాయిలో 2వస్థానం దక్కించేందుకు కృషి చేసిన లెఫ్టినెంట్ రాజేష్‌బాబు, ప్రత్యేక కోర్సుల్లో ఉత్తమ సేవలు అందించిన మణికుమార్, లిఖిత నందినీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు రాజు, అంజిరెడ్డి, దివ్య, అవతార్ సింగ్, రణవీర్ సింగ్, ట్రైనర్స్ సబూర్, రమేష్,ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

7 సబ్‌స్టేషన్‌ల వద్ద సోలార్ ప్లాంట్‌లు

● ఏర్పాటుకు స్థలాల పరిశీలన
● 17 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం



వి.కొప్పెరపాడులో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న
విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

అద్దంకి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సోలార్ విద్యుత్ అందించటమే ధ్యేయంగా పీఎం కుసుమ పథకం ద్వారా చేపట్టనున్న సోలార్ ప్లాంట్‌లకు అసవరమైన స్థలాలను ఎస్‌ఈ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. అద్దంకి నియోజకవర్గంలో 7 సబ్‌స్టేషన్‌లకు అనుబంధంగా 17 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు, వెలమవారిపాలెం, కొమ్మినేనివారిపాలెం, అద్దంకి మండలం సాధునగర్, శంకవరప్పాడు, కుంకుపాడు సబ్‌స్టేషన్‌ల సమీపంలో రైతుల వద్ద నుంచి భూములు లీజుకు తీసుకొని సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావులు ఎకోరన్ ఎనర్జీ ప్రతినిధులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. డీఈఈలు సురేంద్రబాబు, దామోదరం, డివిజన్ కార్యాలయం ఏఈ బాలకోటేశ్వరరావులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి

● సీఐ శేషగిరిరావు



టపాసుల గో డౌన్‌లో జాగ్రత్తలు సూచిస్తున్న
సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్

వేటపాలెం(చీరాల) దీపావళి పర్వదినాన్ని పురస్కరించకుని టపాసులు విక్రయించే దుకాణదారులు నిబంధనలు పాటించాలని సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. వేటపాలెం స్టేషన్ పరిధిలోని పలు గోడౌన్‌లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా పరిసరాల్లో ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. ఎటువంటి విఘాతం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేర పూరిత వ్యవహారాలకు దూరంగా ఉండండి

గవినివారిపాలెం(చీరాల) : విద్యార్థులు నేర పూరిత విషయాలకు దూరంగా ఉండి, క్రమ శిక్షణతో మెలగాలని ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని గవినివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ, బాల్య వివాహాల నియంత్రణ, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు, ట్రైనీ ఎస్సై అలేఖ్య, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్సై రాజ్యలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థికసాయం

అద్దంకిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జై పరుశురామ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన బ్రాహ్మణ విద్యార్థులకు బుధవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ విద్యార్థినులైన చదలవాడ పూజశ్రీ, సత్తెనపల్లి నాగ వెంకట సుప్రజ, సత్తెనపల్లి నాగశారద, రాచపూడి శ్రీ రమ్యతలకు దాతల సహకారంతో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శివనాగేశ్వరరావు, సత్తెనపల్లి పవన్‌కుమార్, రాచపూడి మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి లేకుండా విద్యాభ్యాసం సాగించాలి

బల్లికురవ,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా విద్యాభ్యాసం సాగించాలని మానసిక నిపుణురాలు నాగలక్ష్మి అన్నారు. మండలంలోని కూకట్లపల్లి హైస్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా బుధవారం స్వీయ పరిశీలన, ఆత్మపరిశీలన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో హెచ్‌ఎం జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల ఎంపీడీవోగా విజయ బాధ్యతలు

- దోర్నాల నుంచి డిప్యూటేషన్‌పై రాక

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎంపీడీవోగా ఎన్. విజయ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధుల్లో ఉన్న శివన్నారాయణ ఉద్యోగోన్నతిపై బదిలీ కాగా ఆ స్థానంలో దోర్నాల నుంచి డిప్యుటేషన్‌లో చీరాలకు వచ్చి విజయ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ముందస్తుగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని విజయ సూచించారు.

నేడు ఖోఖో జిల్లాజట్టు ఎంపిక

పంగులూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పంగులూరులో గురువారం అండర్ -19 బాలుర ఖోఖో జిల్లాజట్టు ఎంపిక జరుగుతుందని జూనియర్ కళాశాలల ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి యం.చింపారెడ్డి తెలిపారు. 9వతేదీ మధ్యాహ్నంరెండు గంటలకు పంగులూరు ఎం.ఎస్.ఆర్ అండ్ బి.ఎన్.యం. జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు.ఉమ్మడి ప్రకాశంజిల్లా పరిధిలో ఖోఖో జట్టు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఎస్ఎస్‌సీ ఒరిజనల్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు కళాశాల పీడీ ఎం.సీతారామిరెడ్డి (9848156652)ని సంప్రదించాలని ఆయన కోరారు.

రూ. 10 ల స్టాంప్‌కు 15 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

మార్టూరు,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు అవసరమైన 10,20,50,100 రూపాయల రిజిస్ట్రేషన్ స్టాంపులు లభించడం లేదు. ప్రయివేటుగా కొంత మంది స్టాంపు వెండర్లు దగ్గర లభించే స్టాంపులు ప్రస్తుతం ఎవరి వద్ద దొరకడం లేదు. దాంతో రూ. 10 ల స్టాంప్ కోసం 15 కిమీ దూరంలో ఉన్న చిలకలూరిపేట కు వెళుతున్నారు. అక్కడ స్టాంప్ తీసుకొని మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్నారు. భూములు,స్థలాలు కొనుగోలు అమ్మకాలు సమయంలో అగ్రిమెంట్ నిమిత్తం అవసరమైన స్టాంపులు లభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు మార్టూరులో స్టాంప్‌ల కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా పోతురాజు

మార్టూరు,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన దుడ్డు పోతురాజును నియమించారు. ఈ మేరకు బుధవారం బాపట్లలో జిల్లా ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్ జి. గంగాధరగౌడ్ చేతుల మీదగా పోతురాజు నియామకపత్రాన్ని అందుకున్నారు.



నేషనల్ హైవే పీడీ అనిల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం
అందజేస్తున్న టీడీపీ నాయకులు

జొన్నతాళి వద్ద అండర్‌పాస్ ఎత్తు పెంచాలి

● హైవేపీడీకి సూచించిన ఎమ్మెల్యే ఏలూరి
● వినతిపత్రం అందజేసిన టీడీపీ నాయకులు

మార్టూరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి):జాతీయరహదారిపై మండల పరిధిలో జొన్నతాళి రోడ్డు వద్ద నిర్మాణం జరుపుకుంటున్న అండర్‌పాస్ ఎత్తును పెంచాలని నేషనల్ హైవే పీడీ అనిల్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్‌లో పలు సూచనలు చేశారు. ఈ మేరకు బుధవారం నేషనల్ హైవే పీడీకి ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలకు అనుగుణంగా ఒక వినతిపత్రాన్ని టీడీపీ నాయకులు అందజేశారు. ప్రస్తుతం జొన్నతాళి రోడ్డు వద్ద టెండరు ప్రకారం ప్రతిపాదించిన 4.5 మీటర్లు ఎత్తులో అండర్‌పాస్ నిర్మాణం జరుగుతున్నది. దానిని 5.5 మీటర్లు ఎత్తు వరకు పెంచాలని ఎమ్మెల్యే ఏలూరి హైవేపీడీకి సూచించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మార్టూరు ప్రాంతంలో గ్రానైట్, కంకర, గ్రావెల్, పతి తదితరాలను రవాణా చేసే లారీలు, బస్సుల కోసం తప్పనిసరిగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అండర్‌పాస్ ఎత్తు పెంచాలని ఏలూరి హైవే అధికారిని కోరారు. హైవేవే పీడీకి ఎమ్మెల్యే ఏలూరి పంపించిన వినతిపత్రాన్ని అందజేసిన టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబు, శ్రీకాంత్,షేక్ రజాక్,కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, పెంట్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి పశువైద్యశాలను మార్చుతాం

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి
● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

అద్దంకి, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనంపాడు పశువైద్యశాలను కొత్త భవనంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ ఒక ప్రకటన లో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. బొమ్మనంపాడు పశువైద్యశాలలో పనిచేస్తున్న వైద్యుడు బదిలీపై వెళ్లినందున కొరిశపాడు పశువైద్యాధికారిని ఇన్‌చార్జిగా నియమించామని, వెటర్నరీ అసిస్టెంట్, ఏహెచ్‌ఏలు పనిచేస్తున్నారన్నారు. 5 దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో కొనసాగుతున్నందున వర్షానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అందులో నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



పట్టణంలో నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి హేయం

● పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

చీరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయిపై దాడి అత్యంత హేయమైన చర్య అని, దుండగుడిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, సీఐటీయూ, ఎంఆర్‌పీఎస్ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యావత్ ప్రపంచం ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి చెందినట్లు వివరించారు. సనాతనం ముసుగులో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్ వ్యవస్థను నిషేధించాలని డిమాండ్ చేశారు. నాయకులు లింగంపల్లి జయరాజ్, ఎస్ బాబురావు, ఎం వసంతరావు, గోసాల ఆశీర్వాదం, బాబురావు, కాటి మార్క్, లక్ష్మీ నరసయ్య, శ్యామ్యేల్, భగవాన్‌దాస్, రవిశంకర్, అబ్రహం, సుబ్బారావు, జిలానీ, దీనరాజ్, ప్రసాద్, బీకే రెడ్డి, నాగిరెడ్డి, విమలాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న బల్లికురవ-నాగరాజుపల్లి రోడ్డు

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.11.80 కోట్లు మంజూరు


అద్దంకి,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి 11.80 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పెదజాగర్లమూడి-పూరిమెట్ల రోడ్డులో నాగరాజుపల్లి - బల్లికురవ, కొమ్మాలపాడు-పరిటాలవారిపాలెంల మధ్య 13.5 కి.మీల రోడ్డు అభివృద్ధికి 8.80 కోట్ల రూపాయలు, శింగరకొండపాలెం-అంబడిపూడి,జె.పంగులూరు-బి.నిడమానూరు రోడ్డులలో 10 కి.మీ రోడ్డు అభివృద్ధికి 3 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు.

రేపు మార్టూరులో రైతుసంఘం మహాసభ

మార్టూరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి):ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మూడవ మండల రైతుసంఘం మహాసభను శుక్రవారం మార్టూరులో ఏర్పాటుచేసినట్లు రైతుసంఘం మండల కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విశ్రాంత ఉద్యోగుల భవనంలో రైతు ప్రతినిధుల సభను నిర్వహిస్తామన్నారు సాయంత్రం 4 గంటలకు కొణిదెనరోడ్‌లో మార్కెట్ యార్డు ఆవరణలో బహిరంగసభను ఏర్పాటుచేశామన్నారు. మార్టూరు ప్రాంత రైతులు ఈ మహాసభకు తరలిరావాలని కృష్ణమూర్తి ఆ ప్రకటనలో కోరారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

ఇంకొల్లు,అక్టోబరు 8,(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలు శ్రేష్టమని ఇంకొల్లు సీడీపీవో సులోచనారాణి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా ఇంకొల్లు 2వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పోషకాహారంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బాల్యవివాహాల వలన వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.లీలావతి, వసుందర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



టోల్‌గేట్లలో కొత్త నిబంధనలు

● నవంబరు 15 నుంచి అమలులోకి...

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కొంతమేర ఊరట లభించనుంది. టోల్‌గేట్ల వద్ద ఫాస్టాగ్ చెల్లింపులో రెండు కీలక నిబంధనలను ప్రవేశ పెట్టగా, నవంబరు 15 నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటి వరకు ఫాస్టాగ్ లేని వాహనాలు టోల్‌ప్లాజా వద్ద సాధారణ రుసుమునకు రెట్టింపు మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి ఉండేది. కేంద్రం ఈ నిబంధనను సవరించింది. ఇకపై ఫాస్టాగ్ లేనివారు యూపీఐ ద్వారా సాధారణ రుసుముకు 1.25 రెట్లు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు సాధారణ టోల్ ఫీజు రూ.100 అనుకుంటే ఫాస్టాగ్ ఉన్న వారు రూ.100 చెల్లిస్తారు. కానీ ఫాస్టాగ్ లేనివారు నగదు రూపేణా రూ.200 చెల్లించాలి. అయితే యూపీఐ ద్వారా రూ.125 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, మరో కొత్త నిబంధన అమలులోకి రానుంది. ఫాస్టాగ్ ఖాతాలో డబ్బు ఉన్నా టోల్‌గేట్ వద్ద సాంకేతిక కారణాల వల్ల స్కానింగ్ వ్యవస్థ ఫైయిల్ అయి డబ్బులు కట్ కాకపోతే ఆ వాహనదారులు ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఉచితంగా వెళ్లిపోవచ్చు. ఈ నిర్ణయంతో టోల్‌ప్లాజాల వద్ద సిస్టమ్ వైఫల్యాల వల్ల వాహనాదారులకు కలిగే ఇబ్బందులకు తెర పడనుంది.



'సోమశిల'కు 20,905 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 20,905 క్యూసెక్కుల వరద కొనసాగింది. ఇక డ్యాంలో 73.408 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్ల ద్వారా 22,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజీ వద్ద...

సంగం : సోమశిల నుంచి సంగం బ్యారేజీకి 22,250 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. ఈ నీటితోపాటు బ్యారేజీకి ఎగువ, పెన్నానది పరివాహక ప్రాంతంలో రెండు రోజులుగా కురిసిన వర్షం వల్ల వాగులు, వంకలు ప్రవహించి సుమారు మరో 600 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.6 అడుగులు నమోదయింది.





అయ్యో.. లక్ష్మి!

గాలికి ఎగిరిపోయే పట్టలే ఆమెకు గూడు. ఓ ఐదు పదుల వయసు ఉంటుంది. చింపిరి జుట్టు.. లేవలేని స్థితిలో చిరిగిన రగ్గుల కిందనే పడక.. చేతికి ఏమైందో ఏమో గానీ.. ఓ గుడ్డ కట్టి ఉంది. ఎవరైనా భోజనం తెచ్చినా తినలేని దైన్యం. పగటి పూట ఒంటిని కమ్మేస్తున్న ఈగలు.. రాత్రిపూట ఒంట్లో రక్తం లేకపోయినా చర్మాన్ని పీకేస్తున్న దోమలు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జీవచ్ఛవంగా పడిఉంది. ఈమె పేరు లక్ష్మి. ఎప్పుడో మూడు రోజుల క్రితం వెళ్లిన తన పెనిమిటి కోసం మూతపడుతున్న కళ్లను కాయలు కాచేలా ఎదురుచూస్తోంది. కానీ ఆమెకు తెలియదు.. ఇక తన భర్త రాడనీ. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమైన ఇద్దరిలో ఈ ముదుసలి భర్త కూడా ఉన్నాడు. ఇవేమీ తెలియని లక్ష్మి మాత్రం భర్త వెళ్లిన దారిని ఆశగా చూస్తోంది.

- సమగ్ర కథనం 8లో..

మహర్దశ

రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులిచ్చిన ప్రభుత్వం

జిల్లాలో 18 రోడ్లకు రూ.73.4 కోట్ల మంజూరు

నిధులు మంజూరైన రోడ్ల వివరాలు

రోడ్డు పేరు	పొడవు (కి.మీ)	నిధులు (రూ.లక్షలు)
ఆత్మకూరు-సోమశిల	8	500
బుచ్చి - ఊటుకూరు	29	800
నెల్లూరు-ములుమూడి-తాటిపర్తి	14	400
నెల్లూరు-పొదలకూరు-సైదాపురం	19	800
నెల్లూరు-కృష్ణపట్నం	5	350
గూడూరు - తురిమెర్ల రోడ్డు	10	500
ఎన్‌బీ రోడ్డు - గౌరవరం, ఎన్‌బీ రోడ్డు-పల్లిపాడు	15	600
టీపీ గూడూరు- సీఎస్ పురం	8	360
వీఎం రోడ్డు - తిరుమలమ్మపాలెం రోడ్డు	9	360
పెనుబర్తి-మాదరాజగూడూరు-కలివేలపాలెం	9	490
వీఎస్ రోడ్డు - పెంచలకోన వయా రామన్నగారిపల్లె	1	60
ఊటుకూరు-పెరుమాళ్లపాడు	4	240
బాంబే రోడ్డు - కోవూరు వయా గంగవరం	8	320
కావలి - కొండాపురం	7	300
పోకూరు- రాళ్లపాడు వయా చీమలపెంట	14	300
ఆర్‌ఐ రోడ్డు - అల్లూరు వయా పురిణి	11	260
ఎంసీ రోడ్డు - ఎస్‌కే రోడ్డు వయా బోగోలు	15	350
ఎంసీ రోడ్డు - కట్టువపల్లి వయా పూలతోట	12	350
మొత్తం 18 రోడ్లు	198	73.4 కోట్లు



గుంతలున్న చోట కొత్తగా లేయర్ నిర్మాణం

పొట్టేపాలెం బ్రిడ్జికి ఎట్టకేలకు మోక్షం

నెల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కనెక్టివిటీలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో (ఎండీఆర్) గుంతలు లేకుండా కొత్త లేయర్ వేసేందుకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా 274 రోడ్లకు సంబంధించి 2,104 కి.మీ మేర బాగు చేసేందుకు రూ.వెయ్యి కోట్లు పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఆ జాబితాలో జిల్లా నుంచి 18 రోడ్లు చోటు దక్కించుకున్నాయి. ఆర్‌అండ్‌బీ నెల్లూరు సర్కిల్ పరిధిలో 18 రోడ్లకు సంబంధించి 198 కి.మీ మేర బాగు చేయనున్నారు. ఇందుకుగానూ రూ.73.40 కోట్లు కేటాయించింది. ఇందులో 85 కి.మీ మేర రూ.33.50 కోట్లతో రాష్ట్ర రహదారులను బాగు చేయనుండగా, 113 కి.మీ మేర ఎండీఆర్ రోడ్లను రూ.39.90 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. జిల్లాలో గుంతలుగా ఉన్న కీలకమైన రోడ్లన్నింటికీ దాదాపుగా నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవనున్నారు. కాగా ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల్లో నెల్లూరు-ములుమూడి-తాటిపర్తి రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జిని నిర్మించనున్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత తదితరులు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి సమీపంలోని తాటిపర్తిపాళెం వద్ద విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు బుధవారం పరిశీలించారు. ఇప్పటికే హెలీప్యాడ్, రోడ్లను ఏర్పాటు చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అయితే చంద్రబాబు పర్యటన గురువారం అధికారికంగా ఖరారు కానున్నట్లు సమాచారం.

సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు

● 3 నుంచి కొనసాగుతున్న డాక్టర్ల ఆందోళన

● పీహెచ్‌సీల్లో రోగులకు నర్సులే దిక్కు

8

నగదు కోసమే జంట హత్యలు

● పాత నేరస్థుల ఘాతుకం

● పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జంట హత్యల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హత్యలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నగదు కోసమే హత్యలు చేశామని ఆ పాత నేరస్థులు అంగీకరించినట్లు సమాచారం. పెన్నా బ్యారేజ్ సమీపంలో జంట హత్యల సమాచారం అందిన వెంటనే నగర డీఎస్పీ సింధుప్రియ, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు సిబ్బందితో కలిసి కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. పోలయ్య, శివకుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించడంతోపాటు స్థానికులను విచారించారు. మృతుల్లో ఒకరు సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లే దారిలో గుడారంలో ఉంటున్న పోలయ్య, మరొకరు కడప జిల్లాకు చెందిన శివ కుమార్‌గా గుర్తించారు. సోమవారం రాత్రి శివతోపాటు మరో నలుగురు రంగనాయకుల గేటు వద్ద భోజనం చేసి పెన్నా వారధి వద్ద నిద్రించేందుకు వెళ్తుండగా నగరంలోని పుట్టా ఎస్టేట్‌కు చెందిన మదిరి సాయిశంకర్, ముత్తుకూరు మండలం నారికేలపల్లికి చెందిన కొండాపురం మనోజ్ (వీరు పాత నేరస్థులు) అడ్డుకున్నారు. మద్యం సేవించేందుకు వారిని నగదు అడిగారు. తమ వద్ద నగదు లేవని చెబుతున్నా వినకుండా వారిపై ఆ ఇద్దరు రాళ్లతో దాడికి దిగారు. దీంతో నలుగురు అక్కడ నుంచి పరారవగా శివ వారికి చిక్కాడు. ఆ ఇద్దరు శివను తీవ్రంగా కొట్టి చంపేసి, జాఫర్‌సాహెబ్ కాలువలో పడేశారు. కొద్దిసేపటికి అదే మార్గంలో వస్తున్న పోలయ్యను కూడా నగదు అడిగారు. ఆయన లేదని చెప్పడంతో ఆయన్ను కూడా తీవ్రంగా కొట్టి కాలువలో పడేసి, పరారయ్యారు. ఈ హత్యలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నగదు కోసమే హత్యలు చేశామని వారు అంగీకరించినట్లు సమాచారం. కాగా, సాయిశంకర్‌పై నగరంలో 3 కేసులు, మనోజ్‌పై ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో 12 కేసులు ఉన్నట్లు నగర డీఎస్పీ సింధుప్రియ ఓ ప్రకటనలో తెలిపారు.



ఆటోవాలా ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం సాయంత్రం ఆటోవాలాల ర్యాలీ ఆకట్టుకుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

- వివరాలు 8లో...

టపాసుల గోదాములు, తయారీ కేంద్రాల్లో తనిఖీ చేయండి

● 48 గంటల్లోపు నివేదిక ఇవ్వాలి : కలెక్టర్

నెల్లూరు (క్రైం) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల తయారీ కేంద్రాలు, గోదాములపై వెంటనే తనిఖీ చేసి 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. నిబంధనల ప్రకారం అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలులో ఉన్నాయో లేదో సమగ్రంగా పరిశీలించాలని ఓ ప్రకటనలో సూచించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తయారీ కేంద్రాల సమీపంలో పాఠశాల లేదా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు లేకుండా చూసుకోవాలని, కేవలం లైసెన్సు పొందిన వారే బాణాసంచా తయారీ, నిల్వ చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి!

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎస్. జవహర్ అన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆధార పడకుండా జిల్లాలో పరిశ్రమలు విస్తృతంగా ఉన్న దృష్ట్యా సీఎస్ఆర్ నిధుల ద్వారా వసతుల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎలాంటి లోటు రానీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుతోపాటు దేహదారుఢ్యం, పారిశుధ్యం, పర్యావరణం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తక్కువగా నమోదు కావటం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాలకీర్తి శ్రీనివాసులు, ఇందూరుపల్లి మణి, మనోజ్‌కుమార్, పరుశురాం, రమణయ్య తదితరులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జవహర్‌కు వినతులు అందచేశారు.

ఇంటర్మీడియట్‌లో 'ముందస్తు' గుబులు

● ఫిబ్రవరిలోనే వార్షిక పరీక్షలు

● విద్యార్థులకు నష్టమంటున్న అధ్యాపకులు

● సిలబస్ పూర్తవుతుందో లేదోనన్న సందేహం

● ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

కందుకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విద్యార్థులలో గుబులు రేపుతోంది. ఎన్నడూ లేనివిధంగా ఫిబ్రవరిలోనే పరీక్షలు నిర్వహిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతామని విద్యార్థులు ఆందోళన చెందుతుండగా ఫలితాలపై తీవ్రప్రభావం చూపే ప్రమాదం ఉందని ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు సందేహిస్తున్నారు. ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిలబస్ కూడా పూర్తిచేయగలుగుతామా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2026, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యేలా రాష్ట్ర విద్యా శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. గత కొన్నేళ్లతో పోలిస్తే దాదాపు నెలరోజులు ముందుగా పరీక్షలు ప్రారంభమవుతుండగా గత సంవత్సరంతో పోల్చినా పరీక్షలు పది రోజులు ముందుకొచ్చాయి. కేవలం ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ముందుకు రావడమేగాక జనవరి నుంచి విద్యార్థులు రివిజన్‌పై దృష్టి పెట్టుకునేందుకు ఆస్కారం లేకుండా వివిధ రకాల పరీక్షల షెడ్యూల్స్ ఉండటం తీవ్రనష్టం కలిగిస్తుందని అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. జనవరి ప్రథమార్థం నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవులతో ముగిసిపోతుండగా 24 నుంచి 29వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. జనవరి ప్రారంభం నుంచే జేఈఈ మెయిన్స్‌పై విద్యార్థులు దృష్టిసారించాల్సి ఉంటుంది. ఆ వెంటనే ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయి. అవి పూర్తయ్యాక 13 రోజుల్లోనే పబ్లిక్ ఎగ్జామినేషన్స్ ప్రారంభమవుతుండటం విద్యార్థులపై ఎంతో ఒత్తిడి పెంచుతుందని ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని కోరుకుంటున్నారు. అనేక ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు సగం సిలబస్ కూడా పూర్తవలేదు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎలాగోలా సిలబస్ పూర్తయినా రివిజన్‌కు అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికితోడు గత సంవత్సరం వరకు 16, 17 రోజుల్లో పూర్తయ్యే ఇంటర్ ఎగ్జామ్స్ ఈ ఏడాది 28 రోజుల పాటు జరగనున్నాయి. కీలకమైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఎగ్జామ్స్‌కు ఒక్కో ఎగ్జామ్‌కు వారం రోజులు గ్యాప్ వస్తుండటం కూడా నష్టం కలిగించే అంశమని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని రోజులు పరీక్షల మధ్య గ్యాప్ రావటం ప్రైవేటు విద్యాసంస్థలకు మేలవుతుందని ఆ సమయాన్ని వారు రివిజన్‌కు వాడుకుంటారు కానీ ప్రభుత్వ పాఠశాలల్లో అధ్యాపకులంతా పరీక్షల డ్యూటీలో ఉంటారు కనుక విద్యార్థులు ఈ వారం రోజులు సరదాగా గడిపేసి నష్టపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని అభిప్రాయపడు తున్నారు.



● సెమినార్‌లతో ముప్పు

ఇంటర్ కాలేజీల్లో 5 రోజులపాటు జీఎస్టీ సెమినార్‌లను తప్పనిసరి చేస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాల పట్ల అధ్యాపకులు, కళాశాలల నిర్వాహకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ ఘనతను చాటుకోవటం కోసం ఇలాంటి అనాలోచిత కార్యక్రమాలు పెడుతుండటం ఎంతవరకు సమంజసమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీం కోర్టులో భారత సర్వోన్నత న్యాయాధిపతి బీఆర్ గవాయిపై చెప్పు విసిరిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. బీటీఏ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాకేష్‌కుమార్ ప్రవర్తనను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు కె.మోహనరావు, షేక్ అబ్దుల్లా, రమణయ్య, సుబ్రహ్మణ్యం, మోహనరావు, కోటేశ్వరరావు, అంజయ్య, వెంకటరావు, శివన్నారాయణ, మెండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీటీఏ నాయకులు

రహదారులు ఛిద్రం!

● అధిక లోడుతో ఇసుక టిప్పర్లు



పరిమితికి మించి అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు

కలిగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం రహదారిలో పరిమితికి మించి అధిక లోడుతో ఇసుక టిప్పర్లు ప్రయాణిస్తుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. సంగం వద్ద ఇసుక రీచ్ ఉండటంతో రేయింబవళ్లు ఈ మార్గంలో ప్రమాదకరంగా టిప్పర్లు, ట్రాక్టర్లు ప్రయాణిస్తున్నాయి. కలిగిరి-సంగం రహదారి మొత్తం 28 కి.మీలలో పాతనాపురం వద్ద నుంచి హసనాపురం వరకు ఉన్న 8కి.మీ సింగిల్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఉంది. సంగం నుంచి కలిగిరి మీదుగా కావలి, ఒంగోలు ప్రాంతాలకు ఇసుక రవాణా జరుగుతుండటం, పరిమితికి మించి అధిక లోడుతో ఈ మార్గంలో ప్రయాణించడంతో రహదారులు మొత్తం గోతుల మయంగా మారిపోయాయి. వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల నుంచి నెల్లూరుకు వెళ్లే ఈ మార్గం ప్రయాణాలు చేసేవారితో రద్దీగా ఉంటుంది. ఇసుక టిప్పర్ల తాకిడితో దెబ్బతిన్న ఈ మార్గంలో రాత్రివేళల్లో ప్రయాణం చేసే వాహనదారులు రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతోపాటు పరిమితికి మించి ఇసుకలోడుతో వెళ్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కలిగిరి-సంగం మార్గంలో రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు

6 రోజులు మంచినీటి సరఫరా నిలిపివేత

లింగసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రేళ్లపాడు భారీ మంచినీటి పథకంకు చెందిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో మరమ్మతు పనుల కారణంగా 6 రోజుల పాటు నీటి సరఫరా నిలిపి వేశారు. ఈ పథకం నుంచి గత కొన్ని నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. దీంతో కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ పథకం ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్లను కొన్నింటిని బాగు చేసేందుకు మెకానిక్‌లను రప్పించి పనులను ప్రారంభించారు. దీంతో బుధవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఈ పథకం నుంచి 48 గ్రామాలకు నీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. ఈ పథకం పరిధిలోని లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాహిత్య మేధావి అడవి బాపిరాజు

కావలి(టౌన్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సాహిత్య మేధావి అడవి బాపిరాజు అని సామాజిక కార్యకర్త, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి, కావలి శాఖా గ్రంథాలయాధికారిణి బీ.కోటేశ్వరి తెలిపారు. బుధవారం వెంగళ రావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో అడవి బాపిరాజు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి స్వాతంత్ర సమర యోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త అడవి బాపిరాజు 130వ జయంతి వేడుకలు నిర్వహించకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఆయన రచించిన గోనగన్నారెడ్డి, తుపాను, కోనంగి వంటి నవలలు సాహిత్యరంగంలో చిరస్థాయిగా నిలచిపోతాయని, తెలుగు ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న బావ బావ పన్నీరు అనేపాట ఆయన రచించిందే అన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్ యం.విజయ, పాఠకులు పాల్గొన్నారు.



అడవి బాపిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి, కోటేశ్వరి

జీఎస్టీ సంస్కరణలతో పెరిగిన కొనుగోళ్లు

● అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు నిత్యం అవసరమైన అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పెరిగి దేశాభివృద్ధికి దోహద పడుతోందని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం కావలి పుల్లారెడ్డి నగర్‌లోని వశిష్ట కళాశాలలో జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ పన్నులు ప్రత్యక్ష, పరోక్ష పన్నులుగా రెండు రకాలు ఉంటాయన్నారు. ప్రత్యక్ష పన్ను ఆదాయ పన్ను అని, దానిని ఆదాయం కలిగిన వారే కడతారన్నారు. మనం నిత్యం కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై పన్నులు కలిపి విక్రయిస్తున్నందున దానినే పరోక్ష పన్ను అంటారని, అది ప్రతి ఒక్కరం మనకు తెలికుండానే కడుతున్నామన్నారు. ఈ పరోక్ష పన్నులను జీఎస్టీ రూపంలో నాలుగు శ్లాబుల కింద 5,12,18,28 శాతాల కింద వస్తువులపై విధిస్తూ వచ్చిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత నెలలో జీఎస్టీని 5, 18 శాతంలకు తీసుకు రావటంతో పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరటగా ఉందన్నారు. ఎప్పుడైతే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందో అప్పుడు దేశాభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు. కనుక ప్రతి ఒక్కరూ తగ్గిన ఈ జీఎస్టీపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఎవరైనా జీఎస్టీని తగ్గించకుండా సరుకులను విక్రయిస్తే మీరు అలాంటి వారిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వశిష్ట కళాశాల ప్రిన్సిపాల్ అన్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

కావలి(టౌన్,ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి దామిశెట్టి బాలసురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు ఎలోక్యూషన్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. సూపర్ జీఎస్టీ 2.0పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, జీఎస్టీ సవరణ వలన కలిగే ప్రయోజనాలు తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జరిగిన అవగాహన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టీవీ రావు అధ్యక్షతన వహించగా కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణయ్య పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న బాలసురేష్‌బాబు, సుధీర్‌నాయుడు

పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

● ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు

లింగసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎస్సీ కాలనీలోని హెచ్‌పీ పాఠశాల ఆవరణలోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఈ పాఠశాల చాలా కాలం క్రితం నుంచి శిథిలావస్థకు చేరిన విషయం తెలిసిందే. ఈ పాఠశాల స్లాబు పెచ్చులూడి చువ్వలు బయట పడడం, గోడలు నెర్రెలిచ్చాయి.అంతేగాక వర్షం పడ్డప్పుడు పాఠశాల గోడలు నాని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో వర్షం పడ్డప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు కాలనీలోని కమ్యూనిటీ హాలులోకి వెళుతున్నారని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చినపవనిలోని హెచ్‌పీ పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీరు

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ

కొండాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగుంటలో ఉపాధి హామీ పనుల అవకతవకలపై ఏపీడీ మృదుల బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ క్షేత్ర సహాయకుడు బీ.అంకబాబు 2022-23 సంవత్సరానికి సంబంధించి ఒకరి పేరుపై మరొకరు ఉపాధి పనులను చేయించి అవినీతికి పాల్పడినట్లు అదేగ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో విచారణ నిర్వహించామన్నారు. కూలీలను పిలిచి వారి నుంచి వివరాలు సేకరించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో శేషసాయి, ఏపీవో మురళీధరరావు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కూలీలను విచారిస్తున్న ఏపీడీ మృధుల

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ) నిర్వహించిన తైక్వాండో పోటీలలో విశేష ప్రతిభ చూపటం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు కందుకూరు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పీ.సార్థిక్, జే.రేష్మి, ఎస్కే. సాజిద్‌లు ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. వీరు ఈనెల 11, 12వ తేదీలలో రేపల్లెలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కరరావు, బీ. నరేంద్రబాబు, అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్లు

రాఘవేంద్ర కాలనీలో దొంగల హల్‌చల్



సీసీ కెమెరాలో నమోదైన దుండగుల కదలికలు

కావలి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు రాఘవేంద్ర కాలనీలో దొంగలు హల్‌చల్ చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రామవేంద్ర కాలనీలో తాళాలు వేసి ఉన్న దొడ్డంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గుర్రం వెంకట్రావ్, కొండూరు ప్రసాద్, దేవూరుపల్లి అశోక్ ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి ఇళ్లల్లోకి చరబడ్డారు. అయితే అశోక్ ఇంట్లో మాత్రమే కొన్ని వెండి వస్తువులతో పాటు స్కూటీని అపహరించుకెళ్లారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితుడి అశోక్ ఈనెల 7 తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసుల ఆ ప్రాంతంలోని ఇళ్లల్లో సీసీ కెమెరాలను పరిశబూలించగా దుండగులు రాడ్లు పట్టుకుని ఆ ప్రాంతంలో సంచరించడం అక్కడ సీసీ పుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఎమ్మెల్యే ఇంటికి కూతవేటు దూరంలో చోరీ జరిగినా పోలీసులు గోప్యంగా ఉంచటంతో ఆ ప్రాంత వాసులు దొంగల భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

న్యూస్ బాక్స్

చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్?

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతోన్నాయి. మండలానికి ఒక మోడల్ స్కూల్ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరినట్లు సమాచారం. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖకు పంపాలని ఎంపీడీవో బ్రహ్మయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా ఎంఈవో-1 నాగేశ్వరరావును మండలంలో ఎంత మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ లోపు విద్యనభ్యసిస్తున్నారనే వివరాలతో కూడిన నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వానికి వెళితే మండలానికి మోడల్‌స్కూల్ వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉండడంతో మోడల్‌స్కూల్ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణ, విద్యార్థుల వివరాలు తదితర పనులు చకచకా జరుగుతున్నాయి. చినక్రాక వద్ద ఎన్‌హెచ్ 167బిజి రహదారి పక్కన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడంతో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ఆ ప్రాంతం అనుకూలమని భావిస్తున్నారు. మరికొందరు జలదంకిలో ఏర్పాటు చేస్తే మండలంలో అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాముల సంచారం

● భయం గుప్పెట్లో ఆపరేటర్లు



సబ్‌స్టేషన్ ఆపరేషన్ గదిలోకి దూరిన పాము

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జలదంకి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాముల సంచారం అధికమైంది. దీంతో ఆపరేటర్లు భయంగుప్పెట్లో విధులు నిర్వర్తిస్తున్నారు. సబ్‌స్టేసన్‌లో బుధవారం ఉదయం విధుల్లో ఉన్న ఆపరేటర్ తన గదిలోకి వెళ్లగా పాము తారసపడడంతో భయంతో బయటకు పరుగుపెట్టాడు. అనంతరం గదిలో ఉన్న పామును చంపి బయట పడేశాడు. తరచూ ఆపరేటర్ గదిలోకి పాములు వస్తున్నాయని, భయంతో విధులు నిర్వర్తిస్తున్నామని ఆపరేటర్ పేర్కొన్నాడు. సబ్‌స్టేషన్‌లో నిర్మించి ఉన్న ఆఫీసుగది, ఆపరేటర్ గదిలోకి వెళ్లే మెట్లు నెర్రెలు పడి ఉండడంతో ఈ నెర్రెలలో పాములు చేరి గదుల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అంతేకాక సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రిల కింద కూడా పాములు తరచూ సంచరిస్తున్నాయని, వీటిని ముట్టుకోవాలంటే ఎక్కడ పాములు కరుస్తాయోనని భయపడుతున్నామని విద్యుత్‌లైన్లు వేసే ప్రైవేటు వర్కర్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకుపోగా మెట్లు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలి

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రేడ్ లైసెన్స్‌లు పొందని, రెన్యువల్ చేయని వ్యాపారస్థులకు నోటీసులు ఇచ్చి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు వారి పరిధిలో ఉన్న వ్యాపారస్థుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారికి ట్రేడ్ లైసెన్స్‌లు వేసి రెన్యువల్ చేయని వారితో రెన్యువల్ చేయించి లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలన్నారు.

● 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నవారికి వైద్య పరీక్షలు

పట్టణంలో దివ్యాంగుల పింఛన్ పొందుతూ 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారికి ఈనెల 9, 11, 15, 16 తేదీలలో కావలి ఏరియా వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అంధత్వం ఉన్న వారికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 10వ తేదీన వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైద్యశాలలో ఈనెల 15, 16, 17 తేదీలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మానసిక వైకల్యం ఉన్న వారికి జిల్లా వైద్యశాల నెల్లూరులో ఈనెల 15వ తేదీన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికే వార్డు, సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు వారికి నోటీస్‌లు కూడా జారీ చేశారని, వైకల్యం తక్కువ ఉన్న వారు ఈ వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై మలుపు

● పొంచి ఉన్న ప్రమాదం



జలదంకి పెద్దచెరువు కట్ట కింద రోడ్డు మలుపు

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జలదంకి పెద్దచెరువు కట్ట కింద ప్రాంతంలో నూతనంగా నిర్మాణం జరిగిన ఎన్‌హెచ్167బిజి రహదారిపై ప్రయాణం ప్రమాదపుటంచుల్లో సాగుతోంది. చెరువుకట్ట కింద రోడ్డు పంట పొలాలకంటే ఆరు నుంచి పది అడుగుల మేర ఎత్తుగా వేయడంతో పాటు మలుపులు ఉండడంతో ఏ సమయంలోనైనా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో ప్రయాణం మరింత ప్రమాదకరమని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వేగంగా వాహనాలు వచ్చే సమయంలో మలుపుల వద్ద వాహనాలు అదుపులో లేకుండా ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కొత్తగా వేసిన రోడ్డు వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు కానీ ఎత్తుగా వేసిన రోడ్డు అంచుల ఇనుప కంచెలు కానీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే వీలుంది. జాతీయ రహదారి కాంట్రాక్టరు ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులతో పాటుగా రోడ్డు పంటపొలాల కంటే ఎత్తుగా వేసిన రోడ్డు ప్రాంతాల్లో ఇనుప కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దళిత, గిరిజనులపై కక్షతోనే అంబేడ్కర్‌ను అవమానించారు



అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న దళిత,గిరిజన నేతలు

బిట్రగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత గిరిజనులపై ఉన్న కక్షతోనే దళిత ఆరాధ్యుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ఆయన విగ్రహానికి నల్లటి గ్రీస్ పూశారని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో దళిత, గిరిజనులు ఏర్పాటు చేసుకున్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఉన్మాదులు నల్లటిగ్రీస్ పుయ్యడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు దళిత, గిరిజన సంఘాల నేతలు తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. దళిత, గిరిజన నేతలు తుమ్మ మస్తాన్, చల్లా మాధవి, సముద్రాల దావీదు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులందరి కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాశారని అటువంటి మహానుభావునిని అవమానించడం హేయమైన చర్య అన్నారు. అటువంటి వారు ఎవరైనసరే ఉపేక్షించకుండా పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్.సందానీ, గుర్నాథం రవి, షేక్.రజియా, బీర్జన్, సుధాకర్, బీ.రవిచంద్ర, యు.రవి, వై.జయరాజు, బీ.యోహాను, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించటంతో పాటు కేసుల పురోగతిని విచారించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులలో సత్వర న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఐ శివనాగరాజుకు సూచించారు. అలాగే జూదం, బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు, ఫైనాన్షియల్ వేధింపులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, యాప్‌లతో యువతను ఆర్థికంగా కుంగదీస్తున్న నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



దేవుడా... నాకీ బతుకెందుకు!?

- తొందరగా నీ దగ్గరకు తీసుకెళ్లు..
- పెన్నాలో కదల్లేని స్థితిలో వృద్ధురాలు
- నెల్లూరు జంట హత్యల్లో భర్త
- ఇంకా వస్తాడని కళ్లు కాయలుకాచేలా ఎదురుచూపు

'దేవుడా... నేనేమి పాపం చేశాను... నాకెందుకు ఇలాంటి బతుకునిచ్చావు....ఇకచాలు స్వామీ... నన్ను తొందరగా నీ దగ్గరకు తీసుకెళ్లు'... అంటూ ఓ వృద్ధురాలు కన్నీరుమున్నీరవుతోంది. ఓ పక్క అనారోగ్యంతో పైకి లేవలేని పరిస్థితి. మరో పక్క ఒళ్లంతా ఈగలు వాలడంతో ఆమె నరకాన్ని చూస్తోంది.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పెన్నా బ్యారేజీకి సమీపంలోని శివాలయం ఎదురుగా ప్లాస్టిక్ గోతాలతో కట్టుకున్న చిన్న గుడిసెలో ఒంగోలు ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. ఆమెను పదేళ్ల కిందట బాపట్ల ప్రాంతానికి చెందిన పోలయ్య రెండో వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులు ఒంగోలులో కాపురం పెట్టారు. ఐదేళ్ల కిందట వారు నెల్లూరుకు వచ్చారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లు, రోడ్డు పక్కగా ఉంటూ చివరికి పెన్నా బ్యారేజీ దగ్గర్లో ఉన్న శివాలయం ఎదురుగా చిన్న టెంటులో కాపురం పెట్టారు. ఇద్దరూ ప్లాస్టిక్ సీసాలు వేరుకుంటూ, ఎవరైనా పనులు చెబితే చేస్తూ జీవించేవారు.

● లేవలేని స్థితిలో...

ఆ చిన్నగుడిసెలో ఎముకల గూడుగా లక్ష్మి కనిపిస్తోంది. ఆమె చేతికి అరుదైన వ్యాధి సోకగా, బాధపడుతోంది. అంతేకాక ఆరు నెలలుగా ఇతర రుగ్మతలు కూడా ఆమె బాధిస్తున్నాయి. ఆమె పరిస్థితిని చూసి ఎవరైనా భోజనం తీసుకువచ్చినా, తినలేని పరిస్థితి. పగటి పూట ఒంటిని కమ్మేస్తున్న ఈగలు.. రాత్రిపూట ఒంట్లో రక్తం లేకపోయినా చర్మాన్ని పీకేస్తున్న దోమలు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జీవచ్ఛవంగా ఆమె ఉంది.

● జంట హత్యల్లో భర్త మృతి

ఈ నెల 6న అర్ధరాత్రి రంగనాయకులపేటలో జరిగిన జంట హత్యల్లో లక్ష్మి భర్త పోలయ్య మృతి చెందాడు. అయితే, ఈ విషయం ఆమెకు ఇప్పటికీ తెలియదు. తన భర్త బయటకు వెళ్లి 3 రోజులు అవుతోందని, ఇంకా రాలేదని కన్నీరు పెట్టుకుంటోంది. పోలయ్య హత్యకు గల కారణాలు తెలియక పోయినా.. ఆయన్నే నమ్ముకొని లక్ష్మి జీవిస్తున్నది. హత్యకు గురైన ప్రాంతంలో రక్తపు మరకలను వర్షపు చినుకులు తుడిపేసినా.. నేడో రేపో హంతకులు జైలుకు వెళ్లినా.. లక్ష్మికి మాత్రం ఎవరూ న్యాయం చేయలేరు. అందకేనేమో ఆమె దేవుడి దగ్గరకు వెళ్లాలని ఎదురుచూస్తున్నది.

అబ్దుల్‌కలాం వేసిన బీజం వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):నాడు అబ్దుల్‌కలాం వేసిన బీజం వల్లే నేడు ఆపరేషన్ సిందూర్ ఘన విజయం సాధించిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ సతీష్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో మున్సిపల్ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పురోగాభివృద్ధిపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామేశ్వరంలోని చిన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అబ్దుల్‌కలాం రాష్ట్రపతిగా ఎదగడానికి చదువే కారణమన్నారు. నాటికీ, నేటికీ ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన వేసిన బీజం వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు. స్వదేశీ ఆలోచనలతో రూపొందించిన ఆత్మనిర్భర్ భారత్ ద్వారా యుద్ధాల్లో భారత్ గొప్ప విజయం సాధించిందన్నారు. రష్యాతో కలిసి తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణిలో భారత్ సాంకేతికత ఉందన్నారు. దీన్ని ఉపయోగించి పాక్‌పై తిరుగులేని విజయం సాధించామని అన్నారు. భారత్‌లో క్షిపణులకు నాంది పలికింది అబ్దుల్‌కలామ్‌మేనని గుర్తు చేశారు. ఆయన జయంతిని ఈ నెల 15న ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ డైరెక్టర్ మాధూరి పాల్గొన్నారు.

సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు

- పీహెచ్‌సీల్లో నర్సులే దిక్కు



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వైద్యులు

వైద్యుల సమ్మెతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీల్లో) రోగులకు వైద్య చికిత్సలు అందటం లేదు. నర్సులే చిన్నచిన్న వ్యాధులకు మందులిస్తున్నారు. ఈ నెల 3 నుంచి పీహెచ్‌సీల్లో వైద్యులు ఆందోళన చేస్తుండటంతో ఆయా ఆసుపత్రులకు వచ్చే రోగులు దూరంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 9న పీహెచ్‌సీల్లో జరిగే ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమం ద్వారా గర్భిణులకు అందించాల్సి ప్రత్యేక వైద్య సేవలు వైద్యులు నిలిచిపోనున్నాయి. అలాగే ప్రతి బుధ, శనివారాల్లో జరిగే వ్యాధి నిరోధక టీకాల పర్యవేక్షణ కూడా ఆగిపోయింది. కుటుంబ ఆరోగ్య కార్యక్రమం కింద ప్రతిరోజూ 104 అంబులెన్స్ ద్వారా గ్రామీణులకు సేవలు అందించే కార్యక్రమం కూడా ఆగింది. అలాగే ప్రతి గురువారం ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహించే విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు కూడా ఆగిపోయాయి. ప్రతి ఆఖరి శనివారం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లలో పరీక్షలు చేయాల్సిన విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో పాటు ప్రతి రోజూ 30 నుంచి 50 మంది వరకు పీహెచ్‌సీలకు వచ్చే వ్యాధిగ్రస్థుల రిపోర్టులను వైద్యులు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రిపోర్టులు ఆగాయి.

● డిమాండ్లు ఇవే...

పీహెచ్‌సీ వైద్యుల పీజీ సీట్ల కోటాను గతంలో ఉన్న 30శాతాన్ని గత వైసీపీ ప్రభుత్వం 15 శాతాన్ని తగ్గించింది. అయితే దాన్ని 20 శాతానికి పెంచాలని, మూడేళ్ల పాటు ఈ పీజీ సీట్లు కొనసాగించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాదే అమలు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. అలా కుదరదని వైద్యులు సమ్మె కొనసాగిస్తున్నారు. అలాగే 20 నుంచి 25 ఏళ్లుగా వైద్యులకు ఉద్యోగోన్నతి లేకుండా వైద్యాధికారులుగానే ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వైద్యులకు టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నియోజక వర్గానికి ఓ సివిల్ సర్జన్, ప్రతి నాలుగు పీహెచ్‌సీలకు ఒక డిప్యూటి సివిల్ సర్జన్ లేదంటే డిప్యూటీ డీఎంహెచ్‌వోలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. జీవో నెంబర్ 99ను రద్దు చేయాలని, చంద్రన్న సంచార క్లినిక్‌లకు రూ. 5వేల భత్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనంతో పాటు నోషనల్ ఇంక్రిమెంట్‌లు అందించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలోనే...

ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలి. ప్రస్తుతం తమ సంఘంతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు సానుకూలంగా సాగడం లేదు. త్వరలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నాం. మా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తాత్కాలికంగా సామాజిక వైద్యుల సేవలు

పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెలో ఉండటంతో తాత్కాలికంగా సీహెచ్‌సీల వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ వైద్యులు హాజరు లేని విషయం కూడా సమాచారం అందుతుంది. వైద్యుల సమ్మెను ప్రభుత్వం త్వరలోనే విరమింప చేసి, పీహెచ్‌సీల్లో వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలి.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

వారి కోసమే 'ఆటోడ్రైవర్ల సేవలో..'

- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సీఎం
- ఆటోల ర్యాలీలో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి


ర్యాలీలో ఆటోలో ఉన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రవేశపెట్టారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పారు. బుధవారం బుచ్చిరెడ్డి పాళెంలోని టోల్‌గేట్ వద్ద నుంచి సెయింట్‌మేరి కాలేజీ సమీపంలోని ఓలే అవుట్ వరకు సుమారు 500 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా రూ. 435 కోట్లు ఆటో డ్రైవర్ల ఖాతాలకు జమచేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నగదు జమకాని వారికి కూడా త్వరలో జమ అవుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చి హామీలకు మించి కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అక్షరాలా అమలు చేసి చూపిస్తోందని స్పష్టం చేశారు. బుచ్చి ఊటుకూరు రోడ్డు మరమ్మతులకు సీఎం రూ.8 కోట్లు మంజూరు చేశాని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు, బుచ్చి బ్యాంకుల చైర్మన్లు విజయలక్ష్మి, శివకరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలిక ఫుట్‌బాల్ క్రీడా జట్ల ఎంపికలు శుక్రవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు, ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని సంబంధిత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు క్రీడా సమాఖ్య కార్యదర్శులు బీవీ రమణయ్య(9490320435), ఎం దేవిక(9492936165)ను సం ప్రదించాలని కోరారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 914 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 654 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 260 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315 కాగా, కనిష్ఠ ధర రూ. 70 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఖతర్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ అభ్యర్థులకు ఖతర్ దేశ రాజధాని దోహాలో హోంకేర్ నర్సులుగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ హైఫా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, ఆ దరఖాస్తును ఈనెల 12లోగా నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్న తమ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9849901154 నంబరును సంప్రదించాలని కోరారు.

పాడిరైతుల ఆదాయాభివృద్ధికి కృషి

- పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆదాయాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. పశుసంవర్ధకశాఖ జిల్లా కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో బుధవారం పార్శ్య ప్రణాళిక వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాము విజయవంతంగా పూర్తిచేసుకున్న పాలిటెక్నిక్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా జేడీ పాల్గొని మాట్లాడారు. శిక్షణ కాలంలో విద్యార్థులు పశువుల ప్రాథమిక వైద్యం, క్లీనికల్ పరీక్షలు, వ్యాధి నివారణ టీకాలు, శస్త్రచికిత్సలలో సహాయం చేయడం, పశువుల పోషణ, సంరక్షణ వంటి పలు అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారని చెప్పారు. భవిష్యత్తులో మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ టీ సోమయ్య, ఏడీ మాలకొండయ్య పాల్గొన్నారు.

ఎండ... వాన !

- 8.2 మి.మీ. వర్షపాతం నమోదు


పిడుగుపడి మృతి చెందిన గేదెలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండ, వాన దోబూచులాడుతున్నాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంటుండగా మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడుతోంది. ఆ తర్వాత వర్షం కురుస్తోంది. మళ్లీ కాపేసటికి ఎండ కనిపిస్తోంది. రెండు రోజులుగా ఇదే పరిస్థితి. మంగళవారం నాటి కుండపోత వర్షంతో వాతావరణ చల్లబడగా బుధవారం మధ్యాహ్నం వరకు ఎండకాసింది. బుధవారం సాయంత్రం మళ్లీ వర్షం పడింది. వాన కురవడంతో రహదారులపైకి నీరు చేరింది. నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు, బారకాసు, వేదాయపాళెం, రాయాజీ వీధి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం 8.2 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొండాపురంలో 53.4 మి.మీ. వర్షం కురవగా అత్యల్పంగా పొదలకూరులో ఒక మి.మీ. వర్షం పడింది. నెల్లూరు అర్బన్‌లో 36.2, నెల్లూరు రూరల్‌లో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పిడుగుపడి రెండు గేదెలు మృతి

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామదలలో బుధవారం మధ్యాహ్నం పెద్దపెద్ద శబ్దాలతో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ ఉరుములు, మెరుపులకు ఆదిరెడ్డిపాలెంలో పిడుగుపడి మునగాల వీరరాఘవరెడ్డికి చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి భారీ శబ్దాలతో వీరరాఘవరెడ్డి పశువుల దొడ్డిలో పిడుగులు పడ్డాయి. దీంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో బాధిత రైతుకు రూ.80 వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, వేదికపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య, వీసీ అల్లం శ్రీనివాసరావు తదితరులు

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వస్తు తయారీలో ప్రమాణాలు పాటించడమే కాదు.. కాలుష్యాన్ని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వీఎస్‌యూలో ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఎఫ్ఎస్ఎంఈ ఆధ్వర్యంలో జరిగిన స్టాండర్డ్స్ కాన్ క్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు అయినా వినియోగదారులకు నాణ్యతతో అందించాలన్నారు. ప్రమాణాలు తగ్గితే టీడీపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. నకిలీ మద్యం విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందన్నారు. ఆ స్కామ్‌తో సంబంధం ఉన్న టీడీపీ నేతలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసేశారన్నారు. నిందితులను అరెస్ట్ చేయడమే కాకుండా కఠిన చర్యలు ఉండేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇలాంటి స్పందన వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ చూడలేదన్నారు. పరిశ్రమలు పెద్దసంఖ్యలో ఏర్పాటవుతున్నాయని, ప్రధానంగా పేదలు, గిరిజనులు ఎక్కువగా కాలుష్యం బారిన పడుతున్నారని, కాలుష్యం పెరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీపీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కే పరశురామయ్య, వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ కళ్లే సాయికౌశిక్, ఎఫ్ఎస్ఎంఈ జాతీయ అధ్యక్షుడు ఏ.పీ.కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొట్టేపాళెం కలుజు వద్ద ఓ వ్యక్తి హత్యకు యత్నించిన కేసులో ముగ్గురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వేణు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో మంగళవారం మాణికల మణిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సోమశిలకు చెందిన సూర్య, మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజ రుపరిచినట్లు ఆయన తెలిపారు.

ప్రతీ ఇంటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందాలి

- అవగాహన సదస్సులో ఎంపీ వేమిరెడ్డి



సదస్సులో జీఎస్టీ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని వీఎస్ఆర్ కల్యాణ మండపంలో జిల్లా సేల్స్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆదేశాలతో జీఎస్టీపై ప్రచారం చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్టీ సంస్కరణలు చేపట్టిందన్నారు. జీఎస్టీ 2.0పై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని కోరారు. వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0పై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు దశల వారీగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. తమశాఖ తరపున ధరల బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో జీఎస్టీ అవగాహన కరపత్రాలను ఎంపీ వేమిరెడ్డితో కలిసి, అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్‌టాక్సు బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్, కార్యక్రమ కన్వీనర్ కృష్ణమోహన్, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఏసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య నాయడు, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో సంపద తయారు చేయాలి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ హిమాన్షు శుక్లా




సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు,

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థాలను విలువైన సంపదగా మార్చేందుకు జిల్లాలో రీసైక్లింగ్ యునిట్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ 4.0పై పారిశ్రామిక వేత్తలతో జిల్లా పరిశ్రమలశాఖ, పర్యావరణ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ రోజూ 350 టన్నుల తడి, పొడి వ్యర్థాలను నెల్లూరు నగరపాలక సంస్థ సేకరిస్తోందని, ఈ వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్ల ద్వారా విలువైన సంపదగా మార్చవచ్చన్నారు. ఆ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వపరంగా అన్నీ సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తామన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ డాక్టర్. పీ కృష్ణయ్య మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. వేస్ట్ రీసైక్లింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో పేరుకుపోయిన దాదాపు 85 లక్షల టన్నుల చెత్తను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమా ర్, మున్సిపల్ కమిషనర్ నందన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.